# ఈరోజు తెలంగాణ

ప్రజల ఆయుధం..



## విలేకరులు కావలెను

ఈరోజు తెలంగాణ పేపర్లో పనిచేయుటకు విలేకరులు కావలెను. మండల. జిల్లా. వారీగా కావాలి ఆసక్తిగలవారు నెంబర్కు ఫోన్ చేయగలరు

ఫోన్ నెంబర్ : 8008836669



పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  ఎడిటర్ : టి రామకృష్ణ  సంపుటి : 01  సంచిక : 138 శనివారం 07-6-2025


## జైలు నుంచి బయటకు వచ్చి తొడగొట్టి చెప్పాను :

# ఆలేరు సభలో రేవంత్ రెడ్డి

- ఆలేరులో రూ.1500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మార్చామని వెల్లడి
- 60 కిలోల బంగారంతో యాదగిరిగుట్ట ఆలయ గోపురం నిర్మాణం
- మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం.. అడ్డుకుంటే ఊరుకోం అని హెచ్చరిక
- బీఆర్ఎస్ అంటే 'దెయ్యాల రాజ్య సమితి' అని తీవ్ర విమర్శలు
- పార్టీలో దెయ్యాలు చేరారని ఆ పార్టీ నాయకురాలే చెప్పారన్న ముఖ్యమంత్రి




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గంలో పర్యటించి, సుమారు రూ.1500 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, "యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు స్వేచ్ఛగా నిద్రించేలా, ఆటోలు యథావిధిగా నడిచేలా చర్యలు తీసుకుంటాం. యాదగిరిగుట్ట ఆలయ గోపురం నిర్మాణానికి 60 కిలోల బంగారం కేటాయించాలని నిర్ణయించాం. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో తెలంగాణలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను విశ్వవిద్యాలయ స్థాయికి అభివృద్ధి చేస్తాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

"ఎవరు అడ్డుపడినా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతాం. నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. దేశంలో సబర్మతి, గంగా నదులను ప్రక్షాళన చేయగలిగినప్పుడు, మూసీ నదిని ఎందుకు శుద్ధి చేయకూడదు?" అని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం బెంగళూరు, చెన్నై, ఢిల్లీ నగరాలతో పోటీ పడదని, టోక్యో, న్యూయార్క్ నగరాలతోనే పోటీ పడి అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నవారా నన్ను ప్రశ్నించేది?

మిగతా 2లో

నన్ను జైలుకు పంపిన వారిని గద్దె దించుతానని శపథం చేశానని, ఆ విధంగా తన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకున్నానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆలేరు బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, "నాకు ఇతర కోరికలేమీ లేవు. నన్ను జైలుకు పంపిన వ్యక్తిని పదవి నుంచి తొలగించాలనుకున్నాను. పట్టుదలతో వారిని గద్దె దించడమే కాకుండా, ఆ కుర్చీలో కూడా కూర్చున్నాను. నా జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాను. ఇకపై మీ (ప్రజలు) లక్ష్యాలను నెరవేర్చడానికే ఒక సోదరుడిగా కష్టపడతాను. నన్ను జైల్లో పెట్టిన వ్యక్తిని పడగొడతానని జైలు నుంచి బయటకు వచ్చిన రోజే తొడగొట్టి చెప్పాను" అని గుర్తు చేసుకున్నారు.



## ఉగ్ర కుట్రలను సాగనివ్వం: కశ్మీర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

# తీవ్ర హెచ్చరిక

- శ్రీనగర్‌లో చారిత్రక చినాబ్ వంతెనను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఎన్ని కుట్రలు చేసినా కశ్మీర్ అభివృద్ధి ఆగదని స్పష్టం
- పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించిన ప్రధాని
- ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు
- భారత రైల్వే నెట్‌వర్క్‌తో కశ్మీర్‌కు అధికారికంగా అనుసంధానం

2లో

# కాళేశ్వరం ఖర్చులు నాకు తెల్వదు



- కార్పొరేషన్ ఏర్పాటు తరువాత అందులో ఆర్థికశాఖ జోక్యంఉండదు
- కేబినెట్ నిర్ణయాలమేరకే మూడు బ్యారేజీల నిర్మాణాలు
- తుమ్మిడి హట్టివద్ద ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్ర అభ్యంతరం చెప్పింది
- సాంకేతిక కమిటీని వేదికల మేరకే మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం
- కాళేశ్వరం కమిషన్ ఎదుటఎంపి ఈటల సమాధానాలు

2

# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు





2లో

- బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో కీలక నేత మైలారపు ఆడెల్లు
- ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు
- తెలంగాణ మావోయిస్టు నేత మైలారపు ఆదెల్లు అలియాస్ భాస్కర్ మృతి
- భాస్కర్ తలపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్టు ప్రకటన మృతుడు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచరా వాసి
- ఘటనా స్థలంలో ఏకే-47 తుపాకీ స్వాధీనం



2లో

# పట్టణాల్లో జి౦3 మోడల్

## ఢిల్లీ సిఎంను చంపేస్తామని బెదిరింపులు..

# భద్రత పెంపు



**ఢిల్లీ :** దేశరాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. ఘజియాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్)కు అర్ధరాత్రి దుండగుడు ఫోన్ చేసి.. సిఎంను హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఢిల్లీ సిఎంకు భద్రత కట్టుదిట్టం చేశారు. ఘజియాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిటీ) తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం (జూన్ 5) రాత్రి 11:00 గంటల ప్రాంతంలో బెదిరింపు కాల్ వచ్చింది. బెదిరింపు కాల్ చేసిన వ్యక్తి.. తర్వాత ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. బెదిరింపులకు పాల్పడిన దుండగుడి పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు

మిగితా 2లో



## విత్తనం నాటక ముందే

# 'రైతు భరోసా'

**హైదరాబాద్:** విత్తనం నాటకం ముందే రైతు భరోసా అందిస్తామని, రాష్ట్రంలో విత్తనాల కొరత లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో 'తెలంగాణ రైతు మహోత్సవం'ను స్థానిక ఎంఎల్ఎ, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు రైతు మహోత్సవ కార్యక్రమానికి మంత్రు ఎడ్లబండిపై ఊరేగింపుగా చేరుకోగా జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్‌లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, వ్యవసాయ శాఖ అధికారులు

మిగితా 2లో

## కేటీఆర్‌కు సుప్రీంకోర్టు

# నోటీసులు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై రూ.25 వేల కోట్ల అవినీతి ఆరోపణల వ్యవహారం - కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ
- కేటీఆర్‌కు అనుకూలంగా గతంలో హైకోర్టు తీర్పు... సుప్రీంలో సవాలు చేసిన సుగుణ - నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని కేటీఆర్‌కు ధర్మాసనం ఆదేశం



2

## జైలు నుంచి బయటకు వచ్చి తొడగొట్టి చెప్పాను :

# ఆలేరు సభలో రేవంత్ రెడ్డి

వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పి అక్కడి ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు" అని ఆయన ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాష్ట్ర బడ్జెట్ రూ.20 లక్షల కోట్లు ఉంటే, కేవలం రూ.2 వేల కోట్లతో పూర్తి చేయాల్సిన ఎస్సెల్బీసీ ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయారు. పదేళ్లలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదు. యాదగిరిగుట్టలో అపచారాలకు పాల్పడినందుకే బీఆర్ఎస్ పరిస్థితి ఇలా తయారైంది. మీరు చేసిన పాపాల వల్లే ఈ దుస్థితి వచ్చింది" అని సీఎం అన్నారు.

"తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే స్వయంగా చెప్పారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. అది డీఆర్ఎస్.. అంటే దెయ్యాల రాజ్య సమితి. ఈ కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటాను. ఇందుకు పార్టీ కార్యకర్తల పూర్తి సహకారం కావాలి" అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుమల దేవస్థానం లాగా యాదగిరి గుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాంమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. యాదగిరిగుట్ట పేరును గత ప్రభుత్వంలో యాదాద్రిగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ ప్రజలంతా పిలుచుకునే యాదగిరిగుట్టగా మార్చామని అన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలిసి శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లాలో సిఎం రేవంత్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆలేరు రైతుల కల నేరవేర్చేందుకు గంధమల్ల రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. దాంతోపాటు జిల్లాలో రూ.15 వందల కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభించారు. అనంతరం తిర్మలాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ.. యాదగిరిగుట్టలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. గంధమల్లను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందని ప్రశ్నించారు. మూసీనది ప్రక్షాళన చేస్తామని ఆనాడే చెప్పామని సిఎం అన్నారు. సబర్మతి, గంగా, యమున ప్రక్షాళన చేస్తున్నప్పుడు మూసీ ఎందుకు ప్రక్షాళన చేయకూడదని ప్రశ్నించారు. "ఎర్రవల్లి, మొయినాబాద్, జన్వాడ ఫాంహౌస్‌లు లాక్కుంటామని మేం అనడం లేదు.. గోదావరి జలాలతో మూసీ ప్రక్షాళన చేస్తామనే అంటున్నాం" అని సిఎం రేవంత్ అన్నారు.

కారు' పార్టీ బిఆర్ఎస్ కాదని, డిఆర్ఎస్ (దయ్యాల రాష్ట్ర సమితి) అని సిఎం రేవంత్ రెడ్డి సరికొత్త భాష్యం చె ప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గంలోని తిర్మాలపురంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన తనదైన శైలిలో బిఆర్ఎస్, కెసిఆర్, హరీశ్‌రావుపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. 'తమ పార్టీలో దయ్యాలు చేరాయని, కెసిఆర్ సొంతింటి బిడ్డనే అం టోంది' అని అన్నారు. కొరివి దయ్యాలను తరిమికొట్టే బాధ్యత తాను తీసుకుంటానని, అందుకు కార్యకర్తలు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఉద్దేశించి సిఎం మా ట్లాడుతూ..గత పదేళ్లలో ఏ రోజైనా మొదటి తారీఖు న జీతాలు పడ్డాయా అని ప్రశ్నించారు. 'ప్రభుత్వ ఉ ద్యోగులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వకుండా ఇన్‌స్టాల్‌మెంట్లలో జీతాలు ఇచ్చినోడు నన్ను ప్రశ్నిస్తాడా?, అని మండిపడ్డారు.

'బంగారు తెలంగాణ ము సుగులో బొందలగడ్డ తెలంగాణగా మార్చినోళ్లు న న్ను విమర్శిస్తారా'? అని అన్నారు. పదేళ్ల పాలనలో ప్రజలను కల్వకుంట పాలన చేసినోళ్లే కల్వకుంట్ల కు టుంబమోళు.. వాసాలమర్రిలో ఆకుల ఆదవ్వకు అల్లనేరేడు పళ్లు ఇచ్చారని, ఆమె ఆస్పత్రిలో పడిందని, కెసిఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి శ్మశానంగా మార్చారని, పనిమంతుడు పందిరేస్తే కుక్కతోక తగిలి కూలిపోయిందన్నట్లు వాసాలమర్రిని కెసిఆర్ నాశ నం చేశారని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పు ణ్యక్షేత్రం యాదగిరి గుట్టను యాదాద్రిగా పేరు మా ర్చారని, లక్షల కోట్ల కాంట్రాక్టర్లతో కలిసి దోచుకు తి న్నారని ఆరోపించారు.

ప్రజా ప్రభుత్వ అధికారంలో కి రాగానే మళ్లీ యాదగిరిగుట్టగా పేరు మార్చామని, టిటిడి తరహాలో యాదగిరిగుట్టకు పాలకవర్గం ఏర్పా టు చేస్తున్నామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరి గుట్టలో మెడికల్ కాలేజీ విద్యా సంస్థలను యూనివర్సిటీగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తాటిచెట్టు అంత ఎదిగి మోకాళ్లలో మెదడు ఉన్న ఒకాయన గంధమల్ల రిజర్వాయర్ గురించి మాట్లాడుతున్నాడుని, రెండు లక్షల కోట్లు ఇరిగేషన్ కోసం కేటాయిస్తే నల్లగొండలో ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదని పరోక్షంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్‌ఎ హరీశ్‌రావును ఉద్దేశించి ప్రశ్నించారు. ఎవరు అడ్డం వచ్చినా మూసీ ప్రక్షాళన చేస్తామని చెప్పామని, ఏదేమైనా మూసీ ప్రక్షాళన చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. 'గుజరాత్‌లో సబర్మతి, యుపిలో గంగా నదిని ప్రక్షాళన చేసుకున్నారు. కానీ మేం.. మా నల్లగొండ బిడ్డలు మూసీ ప్రక్షాళన చేసుకోవద్దా?, మూసీ మురికిలోనే మేం చావాలా? ఇందుకు బిజెపి నేతలు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

'ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూసీ ఫ్లోరైడ్‌తో మా ఆడ బిడ్డలకు పుట్టబోయే బిడ్డలు కాళ్లు, కన్నులు వంకరపోతే బిజెపి, బిఆర్ఎస్ నేతలకు కనిపించడం లేదా'? అని ప్రశ్నించారు. 'మేం మీ ఎర్రవెల్లి, జన్వాడ ఫాంహౌస్‌ను గుంజుకుంటామని అనలేదు కదా? మూసీ కట్టొద్దనే, ప్రక్షాళన చేయొద్దనే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి, గంధమల్ల, పిల్లాయిపల్లి కాల్వలను ఎందుకు పూర్తిచేయలేదని గత ప్రభుత్వ నేతలను సూటిగా ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మెడికల్ కాలేజీ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. కెసిఆర్‌కు ఒక్క నోటీస్ ఇస్తేనే ఆగమాగం అవుతుండని, నెలల తరబడి జైల్లో ఉన్న తనకు ఇంకేం అనిపించాలని రేవంత్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఇందిరమ్మ ఇళ్ళు, మహిళలకు సోలార్ యూనిట్లు వంటి పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆయా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రకాష్, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్‌ఎ బీర్ల ఐలయ్య, ఎంఎల్‌ఎలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, రఘువీర్‌రెడ్డి, ఎంఎల్‌ఎసి శంకర్ నాయక్, తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిసిపి నేత ఆకాంక్ష్ యాదవ్, ఆర్‌డిఒ కృష్ణారెడ్డి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అందెం సంజీవరెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉగ్ర కుట్రలను సాగనివ్వం: కశ్మీర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరిక

**జమ్ముకశ్మీర్ :** జమ్ముకశ్మీర్ అభివృద్ధి ప్రస్థానంలో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెన ఒక కీలక మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కుట్రలు పన్నినా కశ్మీర్‌లో ప్రగతిని ఎవరూ నిలువరించలేరని ఆయన స్పష్టం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం తొలిసారిగా కశ్మీర్ లోయలో పర్యటించిన ప్రధాని, శుక్రవారం ఈ ప్రతిష్ఠాత్మక వంతెనను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, పహల్గామ్ దాడి ఘటనను, ఉగ్రవాదులకు బుద్ధి చెప్పిన 'ఆపరేషన్ సిందూర్'ను ఆయన గుర్తుచేశారు.

"మన పొరుగున ఉన్న దేశం పర్యాటకానికి, మానవత్వానికి శత్రువులా వ్యవహరిస్తోంది. ఇక్కడి పర్యాటకాన్ని దెబ్బతీసి, పేదల జీవనోపాధిని దెబ్బతీయాలని చూస్తోంది" అని ప్రధాని అన్నారు. పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన ఆదిల్ హుస్సేన్ అనే పోనీవాలాను ఆయన స్మరించుకున్నారు. "కుటుంబ పోషణ కోసం కష్టపడే ఆదిల్ హుస్సేన్‌ను కూడా ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. ఉగ్రవాదంపై మా పోరాటం ఆగదు. పాకిస్థాన్ కుయుక్తులను భారత్ ఎప్పటికప్పుడు తిప్పికొడుతూనే ఉంది. ఉగ్ర కుట్రలకు మేం దీటుగా సమాధానమిస్తున్నాం" అని మోదీ తెలిపారు.

"కశ్మీర్‌లో పర్యాటకాన్ని నాశనం చేయాలనే దురుద్దేశంతో, దేశంలో అలజడి సృష్టించాలనే లక్ష్యంతోనే పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. అమాయకుల ప్రాణాలు తీశారు. దీనికి ప్రతీకారంగానే 'ఆపరేషన్ సిందూర్' ద్వారా మన సత్తా ఏంటో చూపించాం. సరిగ్గా నెల రోజుల క్రితం పొరుగు దేశంలోని ఉగ్ర స్థావరాలను మన బలగాలు నేలమట్టం చేశాయి. పాక్ నాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేశాం. ఎన్ని కుట్రలు చేసినా కశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోలేరు" అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

**ఇంజినీరింగ్ అద్భుతం చినాబ్ వంతెన**

"ఈఫిల్ టవర్ కంటే ఎత్తైన చినాబ్ వంతెనను మనం నిర్మించుకున్నాం. ఇది భారత ఇంజినీరింగ్ నైపుణ్యానికి, సంకల్పానికి ప్రతీక" అని ప్రధాని కొనియాడారు. ఈ వంతెన నిర్మాణంతో ఈ ప్రాంతం ఒక ప్రధాన పర్యాటక ఆకర్షణగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ఈ వంతెన నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. అయినప్పటికీ, మాతా వైష్ణోదేవి ఆశీస్సులతో ఇది సాధ్యమైంది. ఈ రోజుతో కశ్మీర్ కూడా భారత రైల్వే నెట్‌వర్క్‌తో పూర్తిగా అనుసంధానమైంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు ప్రయాణం అనేది ఇప్పుడు వాస్తవరూపం దాల్చింది. ఈ రోజు కోసం ఎన్నో తరాలు ఎదురుచూశాయి" అని ప్రధాని పేర్కొన్నారు.(ఈ సందర్భంగా ఓ ఆసక్తికర విషయాన్ని ప్రధాని పంచుకున్నారు. "సీఎం ఒమర్ అబ్దుల్లా గారు 8వ తరగతి చదువుతున్నప్పటి నుంచే ఈ ప్రాజెక్ట్ గురించి కలలు కన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఆ కలను నెరవేర్చింది" అని మోదీ తెలిపారు. ఈ వంతెన ప్రారంభోత్సవం కశ్మీర్ అభివృద్ధిలో నవశకానికి నాంది పలుకుతుందని ఆయన అన్నారు.

# కాళేశ్వరం ఖర్చులు నాకు తెల్వదు

**హైదరాబాద్ :** కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా శుకవారం జస్టిస్ పిసి ఘోష్ ముందు మాజీ ఆర్థిక మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ ఘోష్ అడిగిన ప్రశ్నలకు ఈటల రాజేందర్ సమాధానాలు ఇచ్చారు. దాదాపు ఇరవై నిమిషాల పాటు జరిగిన విచారణలో కమిషన్ అడిగిన పలు అంశాలకు సమాధానాలు చెప్పారు. మీరు ఆర్థిక మంత్రిగా ఏకాలంలో పనిచేశారు అన్న జస్టిస్ ఘోష్ తొలి ప్రశ్నకు ఈటల సమాధానమిస్తూ 2014 జూన్ రెండో తేదీ నుంచి 2018 డిసెంబర్ వరకు తాను ఆర్థికమంత్రిగా బాధ్యతలు నిర్వహించానని చె ప్పారు. ఎవరి నిర్ణయం మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టారనే ప్రశ్నకు ఈటల సమాధానం ఇస్తూ రూ.38వేల కోట్ల అంచనా వ్యయంతో తుమ్మిడిహట్టి వద్ద తలపెట్టగా, ముంపు ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయని మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. దాంతో 152 మీటర్ల నుంచి 148 మీటర్లకు కుదించారని, ప్రాజెక్టు నీటిని రూరల్ డ్రింకింగ్ వాటర్ కోసం 10 టిఎంసిలు, అర్బన్ డ్రింకింగ్ వాటర్ కోసం 30 టిఎంసిలు, ఇండస్ట్రియల్ వాటర్ యూజర్ కింద 15 టిఎంసిలు ఖరారు చేశారని, 16.5 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని లక్షంగా పెట్టుకున్నట్లు ఈటల వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై టెక్నికల్ కమిటీ నివేదిక ఇచ్చిందని, దానిపై నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ ముగ్గురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసినట్లు చెప్పారు. నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు అధ్యక్షతన ఆర్థిక మంత్రిగా తాను, తుమ్మల నాగేశ్వరరావు టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి రూ.63వేల కోట్ల అంచనా వ్యయంతో మూడు బ్యారేజీల నిర్మాణాలకు మంత్రి వర్గ ఉపసంఘం నివేదిక ఇచ్చిందని తెలిపారు. మంత్రి వర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికను రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగుతున్న క్రమంలో రైతుల నుంచి డిమాండ్స్ వచ్చాయని, దాంతో ప్రాజెక్టు వ్యయం రూ.80 వేల నుంచి 85వేల కోట్లు పెరిగిందని, ఆతర్వాత ఏమేరకు ప్రాజెక్టు వ్యయం పెరిగిందో తనకు తెలియదని వివరించారు.

కేబినెట్ సబ్ కమిటీ ఎవరి నిర్ణయం మేరకు 2016 మార్చి 15వ తేదీన మూడు బ్యారేజిల నిర్మాణాలపై రిపోర్టు ఇచ్చిందని జస్టిస్ ఘోష్ ప్రశ్నించగా, టెక్నికల్ రిపోర్టును ఆధారంగా చేసుకుని కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సు చేసిందని, మంత్రివర్గం నిర్ణయం మేరకు బ్యారేజీల నిర్మాణాలు జరిగాయని ఈటల చెప్పారు. టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఆ మూడు చోట్ల బ్యారేజీలను నిర్మించాలని చెప్పిందా ? అన్న ప్రశ్నకు ఈటల సమాధానమిస్తూ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ గోదావరి వెంట చాలా చోట్ల స్టడీ చేయడం జరిగిందని, చివరకు అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల వద్ద నిర్మాణాలు జరిగాయని, అన్నీ మంత్రివర్గం ఆమోదం మేరకు జరిగాయని తెలిపారు. కాళేశ్వరం కార్పొరేషన్ ను ఎందుకు ఏర్పాటుచేశారన్న ప్రశ్నకు ఈట రాజేందర్ సమాధానం ఇస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల బాగాలేని కారణంగానే కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాల్సి వచ్చిందని, కార్పొరేషన్ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చిందని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ లేదని మీరు భావించారా అన్న ప్రశ్నకు ఈటల సమాధానమిస్తూ 2018లో కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు అయ్యాక దాని వ్యవహారాల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ జోక్యం ఉండదు, బడ్జెట్ కేటాయింపుల వరకు నా బాధ్యత అన్నారు. ఆ స్థలాలు బ్యారేజిల నిర్మాణానికి అనువైనవేనని మీరు భావించారా ? అన్న ప్రశ్నకు ఈటల రాజేందర్ సమాధానం ఇస్తూ అది టెక్నికల్ అంశం, దానికి వారే అభ్యంతరం చెప్పాలి, రాజకీయనాయకులుగా మాకు సంబంధం ఉండదు అని సమాదానం ఇచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్‌లో ఆర్థిక క్రమశిక్షణ లేదని మీరు భావించారా ? అన్న కమిషన్ ప్రశ్నకు ఈటల రాజేందర్ సమాధానం నీటిపారుదల శాఖకు ప్రత్యేకంగా అకౌంట్స్ విభాగం, ఆడిట్ విభాగాలు ఉంటాయి, అవే స్క్రూట్నీ చేసుకోవాలని సమాధానం ఇచ్చారు.

# పట్టణాల్లో జిం3 మోడల్

- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కార్యరూపం
- తొలి విడతలో హైదరాబాద్‌లోని 16 మురికివాడల్లో అమలు త్వరలో మిగతా పట్టణాలకు పథకం విస్తరణ
- సమీక్షా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, పేదలు నివసించే ప్రాంతాల్లో జీవనోపాధికి ఆటంకం లేకుండా జీం3 మోడల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. త ద్వారా పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కార్యరూపం దాల్చనుంది. అందులో భాగంగా శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ హైదరాబాద్‌కు దూరంగా గత ప్రభుత్వం 42 వేల ఇళ్లను నిర్మించగా సుమా రు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారని, ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలన జరపగా కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాల్లో ఉంటున్నట్లు తేలిందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా నగరంలోని మురికివాడల్లో పేదలు ఉన్నచోటే జి౦3 పద్దతిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి విడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడలను గుర్తించామని అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ కరీంనగర్ తదితర పట్టణాల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.

గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్టు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మున్ననూరు ఐటిడిఎ పరిధిలోని చెంచు, కొలం, తోటి, కొండరెడ్ల గిరిజనుల కోసం 13,266 ఇళ్లను మంజూరు చేశామన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలోని 16 ఎస్టీ నియోజకవర్గాల్లో ఇప్పటికే 8,750 ఇళ్లు మంజూరు చేశామని మొత్తం కలిపి ఇప్పటివరకు గిరిజనులకు 22,016 ఇళ్లు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకం పునఃప్రారంభం ద్వారా గిరిజనులకు పెద్దఎత్తున లబ్ధి చేకూరనుందని, ఇది వారి స్థిర నివాస కలను నెరవేర్చడమే కాక, భవిష్యత్ తరాలకు భద్రతను కల్పించనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఇళ్లకు తక్షణమే లబ్ధిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# ఢిల్లీ సిఎంను చంపేస్తామని బెదిరింపులు.. భద్రత పెంపు

చేస్తున్నారు. అనుమానితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. దాంతో, అధికారులు అప్రమత్తమయ్యారు. ఆమె భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ నగర పోలీసు కంట్రోల్ రూమ్‌కు (పీసీఆర్) గురువారం రాత్రి ఓ ఆగంతకుడు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఘజియాబాద్ నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిటీ) తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి పీసీఆర్‌కు ఫోన్ చేసి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపుతామని బెదిరించాడు. ఆ తర్వాత వెంటనే తన మొబైల్ ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన ఘజియాబాద్ పోలీసులు, తమ అంతర్రాష్ట్ర సమన్వయ విభాగం ద్వారా ఢిల్లీ పోలీసులకు సమాచారం అందించారు. బెదిరింపు కాల్ వచ్చిన ఫోన్ నంబరుకు చెందిన సిమ్ కార్డు యజమానిని టెలికాం సంస్థ సహకారంతో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అయితే, గురువారం రాత్రి 11 గంటల నుంచి ఆ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో, నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా భద్రతా వలయాన్ని పటిష్టం చేయడంతో, ఆమె బహిరంగ కార్యక్రమాలు, ప్రజలతో సమావేశాలపై ఈ ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రులపై ఇలాంటి బెదిరింపులు, దాడులు జరగడం కొత్తేమీ కాదు. గతంలో కూడా పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. 2019లో, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై ఓ ఆటోరిక్షా డ్రైవర్ చెంపదెబ్బ కొట్టారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేదనే కోపంతో ఆ వ్యక్తి ఈ దాడికి పాల్పడ్డాడు. అంతకుముందు, 2016లో ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో జరిగిన ఓ అధికారిక కార్యక్రమంలో కేజ్రీవాల్‌పై కొందరు నల్ల సిరా చల్లారు. నగరంలో సీఎన్‌జీ వాహనాలకు స్టిక్కర్లు జారీ చేయడంలో కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ పంజాబ్‌కు చెందిన ఓ సంస్థకు చెందిన మహిళ ఈ దాడి చేసింది. అప్పుడు కేజ్రీవాల్ తన ప్రభుత్వం అమలు చేసిన "సరి-బేసి" వాహన నియంత్రణ విధానం విజయంపై బహిరంగ సభలో ప్రసంగిస్తున్నారు. ఇక, 2025 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కూడా కేజ్రీవాల్ భద్రతకు సంబంధించి ఓ ఆందోళనకర ఘటన జరిగింది. ఢిల్లీలోని మాల్వియా నగర్ కాలనీలోని సావిత్రి నగర్ ప్రాంతంలో ఆయన పాదయాత్ర చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై ఓ ద్రవ పదార్థాన్ని విసిరారు. ప్రస్తుత బెదిరింపు ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# విత్తనం నాటక ముందే 'రైతు భరోసా'

ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ%ౌ% 'రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.. దేశానికి వెన్నెముక అయిన రైతును కాపాడుకోవాలి' అని అన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ.. రైతుల అభివృద్ధి, సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని అన్నారు. రైతులతో రాజకీయం చేస్తే వారికే నష్టమని ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానిస్తూ రాజకీయాలకు అతీతంగా రైతులకు సహకరించాలని, అప్పుడే రైతులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారని వెల్లడించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పంటల మార్పిడి విధానం, సేంద్రియ ఎరువులు వాడడంలో రైతులకు అవగాహన కల్పించడం రైతు మహోత్సవం ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా కలెక్టర్ స్థలం కేటాయిస్తే హుస్నాబాద్‌లో 90 టన్నుల నుండి 120 టన్నుల కెపాసిటీ ఆయిల్ పామ్ గోదాం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత రైతులను చైతన్యపరచడమే తెలంగాణ రైతు మహోత్సవ ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మూడు రోజుల నిర్వహించే కిసాన్ మేళా రైతులు విచ్చేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరికరాల వినియోగం తదితర అంశాలపై మెలకువలు తెలుసుకోవాలని.. శాస్త్రవేత్తలతో రైతులు ముఖాముఖి చర్చలు జరిపి సందేహాలను నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. సిఎం రేవంత్ రెడ్డి సహకారంతో గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల నిర్మాణానికి భూసేకరణ పనులు వేగవంతంగా జరుగుతోందని, త్వరలోనే పూర్తి చేసి ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

రైతులు అత్యాధునిక టెక్నాలజీ వినియోగంను పెంచుకోవాలని ఎంఎల్‌ఎసి అంజిరెడ్డి హితవు పలికారు. రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి కొత్త టెక్నాలజీ.. మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగాన్ని పెంచాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని.. విత్తనాలు, గిట్టుబాటు ధరలు, యంత్రాలకు సబ్సిడీ అందిస్తూ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల్ నాగేశ్వరరావు అన్నారు. రైతులు రాజు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. 3 రోజులపాటు నిర్వహించనున్న కిసాన్ మేళాలో జిల్లా రైతులు అధిక సంఖ్యలో పాల్గొని వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతలు, పరికరాల వినియోగంపై అవగాహన ఏర్పరచుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సూచించారు. రైతు మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 150కి పైగా స్టాళ్లను మంత్రులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ గోపితోపాటు పార్టీ నేత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఏఎంసీ ఛైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ ఛైర్మన్ బంక చందు, చిత్తారి రవీందర్, ఎండి హసన్, అక్కు శ్రీనివాస్, కోమటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

**హైదరాబాద్ :** మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల అవినీతికి పాల్పడిందంటూ గతంలో కెటిఆర్ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయనపై నమోదైన కేసులో ఈ పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై కెటిఆర్ చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కెటిఆర్‌పై కేసు నమోదైంది. అయితే, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కెటిఆర్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది.

హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆత్రం సుగుణ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం ఈ పిటిషన్‌పై ప్రతివాదిగా ఉన్న కెటిఆర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కెటిఆర్‌ను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. సుప్రీం జారీ చేసిన నోటీసులపై కెటిఆర్ ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ కేసు మళ్లీ న్యాయ పరంగా కీలక మలుపు తిరి గింది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25 వేల కోట్ల అవినీతికి పాల్పడిందంటూ గతంలో తీవ్ర ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయనపై నమోదైన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై కేసు నమోదైంది. అయితే, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆత్రం సుగుణ సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం, ఈ పిటిషన్‌పై ప్రతివాదిగా ఉన్న కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేటీఆర్‌ను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.

# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

**చత్తీస్‌గఢ్ :** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీకి చెందిన మరో కీలక నేత మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా, నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య గురువా రం నుంచి భీకర పోరు కొనసాగిన విష యం తెలిసిందే. కూంబింగ్ కొనసాగింపు నేపథ్యంలో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆడెల్లు అలియాస్ భా స్కర్ మృతి చెందాడు. ఘటనా స్థలంలో ఎకె -47 ఆయుధాన్ని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు చత్తీస్ గఢ్ పోలీసులు ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలం, ఉరుమడ్ల గ్రామానికి చెందిన భాస్కర్ 1995 నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతని అసలు పేరు మందుగుల భాస్కర్ రావు. ఆయన తండ్రి దుర్గయ్య సిపిఐ (మావోయిస్ట్) తెలంగాణ రాష్ట్ర కమిటీ మంచిర్యాల-కొమరం భీం (ఎంకెబి) డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. భాస్కర్ ప్రస్తుతం తెలంగాణ ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యునికి పనిచేస్తున్నారు. అతనిపై చత్తీస్‌గఢ్‌లో రూ.25 లక్షలు, తెలంగాణలో రూ.20 లక్షలు - మొత్తం 45 లక్షల రివార్డ్ ఉంది. తెలంగాణాలో మావోయిస్ట్ పార్టీని బలోపేతం చేసేందుకు భాస్కర్ కీలకంగా పనిచేశారు. అయితే అతని యత్నాలను తెలంగాణ పోలీసులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టారు. ప్రస్తుతం భాస్కర్ వయసు 53 సంవత్సరాలు. పార్టీని బలోపేతం చేయడానికి , ఎక్కువ మంది విప్లవ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యేటట్లు కృషి చేశాడు. ఆయనపై పోలీసులు నిఘా వేసిన నేపథ్యంలో 2020లో ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన కూంబింగ్ ఆపరేషన్ సమయంలో తిర్యాణి మండల అడవులలో మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు ప్రధాన నాయకులు, ముగ్గురు కార్యకర్తలు పోలీసుల వలకు చిక్కకుండా తప్పించుకోగలిగారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. అంతకుముందు గత నెల 21వ తేదీన జరిగిన మరో భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. గడిచిన 17 రోజుల వ్యవధిలోనే ముగ్గురు ముఖ్యనేతలు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఘటనలు ఆ పార్టీకి భారీ నష్టం జరిగినట్లు భావిస్తున్నారు. కాగా, నేషనల్ పార్కు సమీపంలో ఇతర మావోయిస్టు కార్యకర్తల కోసం ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఈరోజు తెలంగాణ
ప్రజల ఆయుధం..
శనివారం 07 జూన్ 2025




కుమ్మెర గ్రామంలో నిర్వహించిన నాగర్ కర్నూల్ మండల సిపిఐ మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ హాజరైన కార్యకర్తలు

## ఈద్గా పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



**శేర్లింగంపల్లి ఆల్విన్. ఈరోజు తెలంగాణ. జూన్ 6**త్యాగానికి ప్రతీక అయిన పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా 124 ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ గారు ఎల్లమ్మబండ పరిధిలోని గుడ్ విల్ హోటల్ చౌరస్తాలో గల ఈద్గా లో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకోవడానికి అనువుగా ఈద్గా స్థలాన్ని జిహెచ్ఎంసి సిబ్బందితో శుభ్రం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ బక్రీద్ పండుగను ముస్లిం సోదరులందరు ప్రశాంతమైన వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. డివిజన్ ప్రజలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియచేసారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, సమ్మద్, ఖాజా, రాజుగౌడ్, జి.ఎచ్.ఎం.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరం మండల నూతన ఎస్సై గా జి నరేందర్ బాధ్యతల స్వీకరణ.



**గన్నేరువరం: ఈరోజు తెలంగాణ,జూన్ 6 (ము డీకే రమేష్ యాదవ్):** గన్నేరువరం మండలం ఎస్సై గా జి నరేందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు మండల ప్రజలు నాయకులు సహకరించాలని కోరారు. ఇక్కడ విధులు నిర్వహించిన తాండ్ర నరేష్ వేకెన్సీ రిజర్వ్ కరీంనగర్ కు బదిలీ కాగా ఆయనకు పోలీస్ సిబ్బంది మండల నాయకులు ఘన వీడ్కోలు పలికారు.

## బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

**ఈరోజు తెలంగాణ జూన్ 6 నర్సింహులపేట**

**మండల ప్రతినిధి యాకయ్య**



బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ముస్లిం సోదరులతో సమావేశం ఏర్పాటు చేసి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మాలోత్ సురేష్ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసి. బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో కులమతాలకు అతీతంగా, సోదర భావంతో ఇతర మతాలను పరస్పరం గౌరవించుకుంటూ శాంతి యుతంగా బక్రీద్ పర్వదిన వేడుకలను జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు ముస్లిం సోదరులకు సూచన చేశారు, ఈ కార్యక్రమంలో మహబూబ్ ఖాన్,ఖాజామైనోద్దీన్, అమీర్ పాషా, అన్వర్, పాషా, తదితరులు పాల్గొన్నారు

## బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి



హయత్ నగర్. ఈరోజు తెలంగాణ. జూన్ 6రేపు బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులతో హయత్ నగర్ సీఐ నాగరాజు గౌడ్, హయత్ నగర్ పిఎస్ లో సమావేశం ఏర్పాటు చేశారు. బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో కులమతాలకు అతీతంగా, సోదర భావంతో ఇతర మతాలను పరస్పరం గౌరవించుకుంటూ శాంతి యుతంగా వేడుకలను జరుపుకోవాలని సూచించారు. అనంతరం వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు

# సి ఆర్ జీవితం దేశం మొత్తం గర్వపడే విధంగా కృషి చేశారు- సయ్యద్ అజీజ్ పాషా

**కొండాపూర్. ఈరోజు తెలంగాణ. జూన్ 6** చంద్ర రాజేశ్వర రావు గారి 111 వ జయంతి సందర్భంగా ఈ రోజు ఉదయం హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) విగ్రహానికి చంద్ర రాజేశ్వర రావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఉపాధ్యక్షులు, సీ పి ఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్య సభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, సి ఆర్ ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజి ఎం ల్ సి పి . జె. చంద్ర శేఖర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ – సి ఆర్ జీవితం దేశం మొత్తం గర్వపడే విధంగా కృషి చేశారని, ఆయన ప్రజల కొరకు ఎన్నో త్యాగాలను చేశారని, ఒకసారి నార్త్ ఇండియా లోని ఒక జిల్లాలో సంక్షోభం ఏర్పడితే వారం రోజులు అక్కడే ఉండి ప్రజా ప్రజల బాగోగులను చూసుకుంటూ 500 మందిని రక్షించారని తెలిపారు. ప్రధాని నెహ్రూ ఉన్న రోజులలో ఆయనకు వ్యతిరేకంగా పోరాడి దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల నడుస్తూ పీడిత ప్రజల అభ్యున్నతికి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అజీజ్ పాషా కోరారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె రజిని, ఎ ఐ టి యూ సి మాజీ కార్యదర్శి బి వి విజయలక్ష్మి , మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్



జోశ్యభట్ల కల్పన , వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్య, యన్. రాజేంద్ర రావు, డాక్టర్ పి సరస్వతి, మహిళాసంక్షేమ కేంద్రం సభ్యులు వి లలిత, టెక్సాస్ యూనివర్సిటీ స్కాలర్ మిస్ మేరీ, వృద్ధాశ్రమ వాసులు, విద్యార్ధినిలు, తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

# యోగాతో చరిత్ర సృష్టించవచ్చు..!

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**యోగ క్యాలెండర్ విడుదల చేసిన ఎమ్మెల్యే**

**షాద్నగర్. ఈరోజు తెలంగాణ. జూన్ 6** 24 గంటల్లో కొంత సమయం యోగ కోసం కేటాయిస్తే ఆరోగ్య విషయంలో చరిత్ర సృష్టించవచ్చని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయుష్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో 11 ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరికి అవసరమనీ వారి యొక్క ఆరోగ్యాలను కాపాడుకోవాలి అంటే ప్రతి ఒక్కరు కూడా తప్పకుండా ప్రతిరోజు ఆరోగ్యం కోసము ఒక్క గంట సేపు ఎక్సర్సైజులు మరియు యోగా తప్పకుండా చేసుకోవాలని సూచించారు. మరియు ఈనెల జూన్ 21న జాతీయ యోగ డే 10 సంవత్సరములు దాటి,11వ సంవత్సరం యొక్క యోగా డే దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ కూడా జూన్ 21 యోగా డే రోజు పాల్గొని యోగా చేయాలని ప్రజలకు తెలియజేశారు. ఈ




కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చెంది తిరుపతి రెడ్డి, ఖదీర్, నర్సింలు, డాక్టర్ జి. షీలా మేడం , డాక్టర్ జయ ప్రకాష్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ లు బాబు చిన్మయ రంగా, వరలక్ష్మి, ఈశ్వరి, యోగ ఇన్స్ట్రక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు..

# ఏళ్లలో మోడీ ప్రభుత్వ పాలనలో దేశానికి విశ్వఖ్యాతి...

**-ఎన్నో చారిత్రక, సాహసోపేత నిర్ణయాలతో , విజయాలతో మోదీ ప్రభుత్వ పాలన...**

**-11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం... సంకల్ప సాకారం పేరిట చేపట్టాల్సిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలి..**



**గన్నేరువరం. ఈరోజు తెలంగాణ. జూన్ 6(ముడికే రమేష్ యాదవ్):** గన్నేరువరం మండల కార్యశాల లో బీజేపీ అధ్యక్షులు తిప్పర్తి నికేష్ మాట్లాడుతు 014 నుండి నేటి వరకు 11 ఏళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో భారతదేశానికి విశ్వఖ్యాతి వచ్చిందని , దేశ దిశా దశ మారిందని , గత 11 ఏళ్లలో మోడీ సర్కార్ దేశం కోసం ఎన్నో అద్భుతాలు చేపట్టి సాహసోపిత చారిత్రక నిర్ణయాలతో , విజయాలతో ముందు కొనసాగుతుందని బిజెపి..... అన్నారు.. బిజెపి జాతీయ అధ్యక్షులు జేపి నడ్డా ఆదేశాల మేరకు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం – సంకల్ప సాకారం పేరిట చేపట్టే వివిధ కార్యక్రమాల కోసం శుక్రవారం రోజున బిజెపి శ్రేణులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ స్టేట్ కాన్సిల్ నంబర్ పుప్పాల రఘు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్ధవంతమైన , నిర్ణయాత్మక నాయకత్వంలో , వికసిత్ భారత్ లక్ష్య సహకారం దిశగా ఆత్మవిశ్వాసం తో, ఎన్నో చారిత్రక విజయాలతో మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు విజయవంత పాలన పూర్తి చేసుకుంటుందని తెలిపారు. మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, అదేవిధంగా ఆపరేషన్ సింధూర్ లాంటి చారిత్రక విజయంతో దేశ ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుంద న్నారు. జాతీయ పార్టీ పిలుపుమేరకు 11 సంవత్సరాల మోడీ ప్రభుత్వం... సంకల్ప సాకారం పేరిట చేపట్టాల్సిన వివిధ ప్రోగ్రాంలను బిజెపి శ్రేణులు అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందులో ముఖ్యంగాజూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15 వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని, తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. అలాగే 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం, 23న డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, 25న ఎమర్జెన్సీ డే లాంటి ముఖ్య కార్యక్రమాలను ఉన్నాయని, పార్టీ సూచన పత్రంలో ఉన్న అన్ని కార్యక్రమాలను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ విజయవంత పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ , ప్రధాని మోదీకి అభినందనలు తెలియజేస్తూ , ఆపరేషన్ సింధూర్ ను విజయవంతంగా చేపట్టిన భారత త్రివిదదళాలకు, ప్రధాని మోదీ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమలో పాల్గొన్నవారు ఈ కార్యక్రమ కన్వీనర్ ఎలెటి చంద్రారెడ్డి, కో కన్వీనర్ పుల్లేల రాము, మచ్చ బాలరాజు,అటికం రామచంద్రం,బండి తిరుపతి,నందికొండ సురేందర్ రెడ్డి,కాంతాళ రాజిరెడ్డి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి ,నందికొండ స్వామి రెడ్డి ,గీకురు అంజయ్య ,గుంటుకు లక్ష్మీపతి ,కనుకుంట్ల విష్ణు, విలాసారం రాములు, దొంగల జగన్, జి నరసింహస్వామి, సిహెచ్ అమర్ పాల్గొనరు

# షార్ట్ సర్క్యూట్ తో స్టార్టర్లు మోటర్లు దగ్ధం...



**తెగిపడిన 11 కెవి విద్యుత్ వైరు.**



**గన్నేరువరం: ఈరోజు తెలంగాణ జూన్ 6 (ముడికే రమేష్ యాదవ్):** గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఒకసారి గా 11 కెవి విద్యుత్ వైరు తెగి విద్యుత్ మోటార్లకు కరెంటు సరఫరా చేసే లైన్ పైన పడటంతో 14 మంది రైతులకు చెందిన స్టార్టర్లు, ఫీజులు, మోటర్ల లతోపాటు మినీ రైస్ మిల్ మీటర్ మొత్తం ఖాళీ బూడిద అయ్యింది. ఒక్కసారిగా కరెంటు అధిక మొత్తంలో రావడంతో స్టార్టర్లు మోటర్లు కాలిపోయాయని, కరెంటు సరఫరా 24 గంటలు గడిచినప్పటికీ పునరుద్ధరణ జరగకపోవడంతో పశువులకు నీరు లేకుండా పోయిందని, దున్నిన నారు మడులు ఎండిపోతున్నాయని, స్టార్టర్లు ఫీజులు కొత్తయి కొనడానికి సుమారు 10 000 ఖర్చు అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి వెంటనే విద్యుత్ వైర్లు సరిచేయాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్ఫార్మర్ కు అధిక లోడ్ ఉండి ప్రతిరోజు కరెంటు సమస్యలు తలెత్తుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి మరో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైస్ మిల్లులో కాలిన విద్యుత్ మీటర్ ను విజిలెన్స్ ఏడి సత్యనారాయణ రావు పరిశీలించారు. రైతులు ఆయనకు కాలిన ఫీజులను స్టార్టర్లను చూపించి వారి గోడు వెల్లబోసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తాళ్లపల్లి రఘురాం, తాళ్లపల్లి రమేష్, వడ్లకొండ శ్రీనివాస్, సుధగోని మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు తెలంగాణ
ప్రజల ఆయుధం..
శనివారం 07 జూన్ 2025



# పట్టపగలే చుక్కలు చూస్తారా..!?




**షాద్నగర్.ఈరోజు తెలంగాణ. జూన్ 6** రాష్ట్ర%శీ%లో ఒకే విధానాన్నీ అవాలంభించాలని ఒకే చట్టం అమలు చేయాలి కానీ ఇక్కడ షాద్ నగర్ -ఫరూఖ్ నగర్ సబ్ రిజిష్టర్లు చెప్పిందే చట్టం ఇక్కడ వాళ్లు చేసింది న్యాయం. చేతులు తడపండి ఫైలు ముందుకు కదలదు. అవినీతి అక్రమాలు ఉంటే అంతా ఇంతా కాదు.. ఏకంగా మధ్యవర్తులుగా దస్తావేజు లేఖరులని మధ్యన పెట్టి జనాల వద్ద డబ్బులు వాయించేస్తున్నారు. ఏ దస్తావేజుకు ఎంత అన్నది రేట్లు వీళ్లే నిర్ణయించి వాళ్ళ ద్వారా డబ్బులు వసూలు చేస్తున్నట్లు బాహాటంగా విమర్శలు ఉన్నాయి. ఏ బాధితుడిని పట్టుకుని అడిగిన ఈ విషయాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తారు లేదా వినిపిస్తారు. ఇంత అవినీతి అక్రమాలు జరగడానికి కారణం ఏమిటి..? గతంలో అధికారులు ఎవరైనా డబ్బులు ఇస్తే తీసుకోవడానికి కూడా అటు ఇటు ఆలోచించేవారు కానీ ఇప్పుడు అలా కాదు డైరెక్టా ధరలు నిర్ణయించి వాటిని బట్టి దస్త్రాలను దస్తూరి చేస్తుంటారు.

**అసలు కథ ఏమిటంటే..**

షాద్ నగర్ -ఫరుఖ్ నగర్ సబ్ రిజిష్టర్లు ఇద్దరు వీళ్ళు ఇక్కడ జాయిన్ అవ్వగానే ముందు దస్తవేజుల లేఖర్లను పిలిచి రెట్లను నిర్ణయిస్తారు. ఏ దస్తావేజుకు ఎంత వసూలు చేయాలి అని దస్తావేజు లేఖర్లకు హుకుం జారీ చేస్తారు. ఎందుకంటే కొనుగోలు దారులు అమ్మకం దారులు వీళ్ళ దగ్గరే దస్తావేజులు తయారు చేసుకోవడానికి వెళ్తారు.. కాబట్టి వీళ్ళ ద్వారా అయితే అనుమాన%శీ% రాదు అని వీళ్ళ ద్వారా డబ్బులు తీసుకుని సాయంత్రం వసూళ్లు చేస్తారు. ఏ దస్తావేజుకు ఎంత అని ఏదయినా దస్తావేజు తీసుకోని వెళ్తే ముందుగానే వీళ్ళకి చూపించాలి లెదు అంటే అపుడే తయారు చేసిన దస్తావేజు తీసుకువెళ్తే అట్టి దస్తావేజుకు కోర్రిలు పెడతారు. రూలు ప్రకారం ఉన్నా దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేస్తారు కానీ అన్ని రూల్స్ ఉన్నా లేనివి పోనివి కోర్రిలు పెడుతూ రూల్స్ మాట్లాడతారు.. డబ్బులు తీసుకునేటప్పుడు మాత్రం రూల్స్ వర్తించవ్ వీళ్ళకి..

**షాద్ నగర్, ఫరూక్ నగర్ లో వీళ్ళ ధరలు ఇలా..**

ఫరూక్ నగర్, షాద్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సొంత చట్టం ప్రకారం నిర్ణయించుకున్న ధరలు చూస్తే ఆవాక్కు అవుతారు. సేల్ డీడ్ ప్లాటు కు రూ 1000, ఇల్లు కోసం రూ. 2000 నుండి ఇల్లును బట్టి గ్రామ కంఠం 5000, సవరణలు 1000 నుండి 10,000వరకు ఇలా ఒకక్కో దస్తావేజుకు ఒక్కొక ధర నిర్ణయించారు అంటే ఆశ్చర్యపోక తప్పదు. దీని ప్రకారం రోజూ ఏ దస్తావేజు లేకర్లు ఎన్ని చేస్తే సాయంత్రం వాళ్ళ దగ్గర వాళ్ళు ఏర్పాటు చేసుకున్న ప్రయివేయిట్ వ్యక్తి వెళ్లి వసూల్ చేస్తాడు. ఇలా రోజూ వారి వసూల్ నడుస్తుంది ఏ దస్తావేజులు ఆపాలి వీళ్ళకి ఏ దస్తావేజులు ఆపే అధికారం ఉంది సెక్షన్ 22ఏ ప్రకారం లావుని, భూదాన్, అసైన్డ్ కోర్టు ఉత్తరువులు స్టే, స్టేటస్ కో, ఇంజెక్షన్ ఆర్డర్, వక్ఫ్, దేవాదాయ శాఖ ఇలాంటివి దస్తావేజులు చేయకూడదు. ఒకవేళ చేస్తే కూడ పెండింగ్ పెట్టి జిల్లా రిజిష్టర్ కు అనుమతి తోసుకోవాలి.. లేదంటే తిరస్కరించాలి ఇది రూల్. గ్రామంలో రిజిస్ట్రేషన్ గ్రామకంఠం అనగా ఊర్లల్లో అప్పట్లో దస్తావేజులు లేకుండ వారసత్వంగా ఉన్నా ఇండ్లు వాళ్ళ తాతల అనగా వంశపరంగా వచ్చే ఇండ్లు ఇలాంటివి వాటికీ పర్మిషన్లు కానీ దస్తావేజులు కానీ ఉండవు. ఇలాంటి వాటికీ కూడా చాలా బీద వారు వాళ్ళ కుటుంబ సభ్యుల పేర్ల మీద ఆస్తి మార్పిడి చేసుకోవాలి అంటే అవసరానికి అమ్ముకోవాలి అంటే చాలా వ్యయ ప్రయాసలు పడుతున్నారు.

**అంతేనా ..?**

**1908 చట్టం ఎం చెబుతుంది..?**

కొనుగోలు దారుడు అమ్మకం దారుడు దస్తావేజును తయారు చేసుకొని వచ్చాక ఎలాంటి పరిస్థతిలో అయినా దస్తావేజు ఆపొద్దు ఒక వేళ ఆపాలి అంటే సెక్షన్ 47 ప్రకారం పెండింగ్ రిఫర్ చేయాలి కానీ ఎపుడో కట్టుకున్న ఇండ్లకు పర్మిషన్లు అడుగుతారు మన అధికారులు. లెదు అంటే దస్తావేజులు అడుగుతారు. చట్టం క్లియర్ గా చెబుతుంది స్టాంప్ డ్యూటీ కరెక్ట్ గా ఉంటే మీరు ఎలాంటి దస్తావేజులు అపడానికి వీలు లెదు అని, కానీ వీళ్ళు ఒక్కకొక్క ఆఫీసులో ఒక్కొక్క విధానాన్ని అమలు చేస్తున్నారు. కానీ ఇక్కడ మాత్రం వీళ్లు చేసిన చట్ట%శీ% అమలు అవుతుంది. అన్ని రూల్స్ పాటించిన గతంలో వ్యక్తి మార్పిడి దొంగ దస్తావేజులు కూడా అయిన వ్యవహారం కేసులు కూడా నమోదు కాబడ్డాయి. నేరాలకు పాల్పడిన వారు జైలు పాలు కూడా అయినారు.

**గతంలోనే ఎమ్మెల్యే వార్నింగ్..!**

ఇక్కడ అవినీతి అక్రమాల ఆరోపణలు గతంలో మీడియా ద్వారా వచ్చిన నేపథ్యంలోుదట్లో ఇద్దరు సబ్ రిజిష్టర్లకు ఎమ్మెల్యే పిలిచి గట్టిగా హెచ్చరికలు కూడా ఇవ్వడం జరిగింది. ఎవరైనా తమ పేరు చెప్పి వసూళకు పాల్పిడితే బాగుండదు మీరు నాకు తెలియజేయాలి అని కూడా చెప్పారు. ఒకరు ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యే పేరు చెప్పుకొని వసూల్ కూడా చేసినారు వాళ్ళకి కూడా గట్టిగ వార్నిగ్ ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఈ విషయాల్లో ప్రవర్తన మార్చుకోవాలని లేకపోతే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అప్పట్లోనే ఎమ్మెల్యే అందరిని పిలిచి వార్నింగ్ ఇచ్చారు. పేద ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు కలగజేయవద్దని నిబంధనలో ప్రకారం వ్యవహరించాలని అప్పట్లో ఆదేశించారు. అయినా అధికారుల తీరు మారలేదు.

**ప్రజలు ఎం కోరుకుంటున్నారు అంటే**

ఇక్కడ ఏ దస్తావేజు అయినా కొనుగోలు దారుడు అమ్మకం దారుడు రాజిపడి ఇష్ట పూర్వకంగా లావాదేవీలు చేసుకుంటే సబ్ రిజిష్టర్లు మాత్రం లేని పోనీ దస్తావేజులు మరియు ఇతరత్ర దస్తావేజులు అడిగి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. మేము అన్ని చూసుకొని ప్రభుత్వానికీ స్టాంప్ డ్యూటీ కరెక్ట్ కట్టుకొని దస్తావేజు మా ఇష్ట పూర్వక%శీ%గా మేము చేసుకొంటే లేని పోనీవి కొర్రీలు పెట్టి విసిగిస్తూ పైసలు వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

**ఇక స్లాట్ విధానము..**

కొత్తగా ప్రభుత్వం వచ్చినాక ఈ విధానం తీసుకోని వచ్చింది కానీ స్లాట్ విధానం వచ్చాక కూడా ఇక్కడ పరిస్థితి మారలేదు. వాళ్ళకి నచ్చిన టైంకు ఆఫీసుకు వస్తారు.. వాళ్ళు వచ్చే వరకు దస్తావేజులు ఆపుతారు. ఒకరు కూడా సమయాన్ని పాటించరు. వచ్చాక దస్తావేజు చూడడానికి వీళ్ళు చెప్పిన సమయానికి వెళ్ళాలి.. లేదంటే అంతే సంగతులు. రోజూకీ 48 స్లాట్లు పైన కింద ఆఫీసులో సాయంత్రం వేళలో రోజుకి 5 చొప్పున 5గంటల తరువాత మిస్లినేయస్ దస్తావేజులు అనగా స్లాట్ బుక్ కానివి చేయాలనీ ఉంది, కానీ ఒక ఆఫీసులో ఈ విధానాన్నీ నడిపితే ఇంకో ఆఫీసులో ఆలా చేయాలి అంటే నాకేంటి అంటున్నారు..? ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చే రాబడి కూడా తగ్గిపోతుంది.

**ఇకపోతే.. రియల్ ఎస్టేట్ పరిస్థితి**

రాష్టంలో దాదాపు 2 సంవత్సరాల నుండి రియల్ పరిస్థితి దారుణంగా ఉంది. రేట్లు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. పనులు లేక చాలా మంది యువత రియల్ ఎస్టేట్ పైన ఆధార పడి ఉన్నారు కానీ ఇపుడు రియల్ ఎస్టేట్ పరిస్థితి లేక దారుణంగా పడిపోయింది. ఇట్టి పరిస్థితిల్లో రిజిస్ట్రేషన్ శాఖలో ఒకప్లాటు కానీ ఇల్లు కానీ రిజిస్ట్రేషన్ కు వస్తే ఇక్కడ ఇంకో డీల్ చేయాల్సి వస్తుందనీ ప్రజలు లబోదిబో అంటున్నారు.

**జిల్లా, రాష్ట్ర అధికారులు ఎం చేస్తున్నారు..?**

ఇక్కడ ఇంత జరుగుతున్నా అధికారులు తుతూ మాత్రంగా వీళ్ళ పై ఎలాంటి ఛర్యలు ఉండవు. ఎందుకంటే వీళ్ళు కూడా భాగస్వమూలేనా? అని ప్రజలు బహిరంగ%శీ%గా చర్చికుంటున్నారు. పై అధికారులు పట్టించుకోకుంటే ఏసీబి అధికారులు చర్యలు ఏవి అని సామాన్య జనాలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఎన్నో సార్లు షాద్ నగర్ లో రెవెన్యూ శాఖలో గతంలో 2001 నుండి రెవెన్య మున్సిపల్ శాఖలో ఏసీబికీ పట్టుబడిన వారు ఉన్నారు. 2002లో సబ్ రిజిస్ట్రార్ పై కూడా ఏసీబి రైడ్ అయింది. కానీ ప్రయివేట్ వ్యక్తులు తప్పించుకొని అప్పుడు సబ్ రిజిష్టర్ ను కాపాడినారు. ఇపుడు కూడా వీళ్లపై వీళ్ళ బంధువులపై వీళ్ళ ఆస్తులపై నిఘా పెట్టవల్సిన సమయం వచ్చింది అని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ను ప్రోత్సహించి లావాదేవీలు అయ్యేట్లు చూసి రెవెన్యూ పెంచాలనీ ప్రభుత్వం ఆశిస్తే మొదటికే మోక్షం లేనట్లు ఇక్కడ సబ్ రిజిష్టర్లు మాత్రం దానికి భిన్నంగావ్యవహరిస్తున్నారు. ఇప్పటికి అయినా వీళ్ళని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వానికి ప్రజలకు ఇబ్బందులకు గురి కాకుండ ప్రజల సమస్యలు పట్టించుకోవాలని రియల్ ఎస్టేట్ ను ప్రోత్సాహిస్తూ ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచాలని మన షాద్ నగర్ నియోజక వర్గాన్ని ఇంకా రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

**కొంత మందికే అది తెలుసు..**

కర్నాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్న దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యం ఆసియాలోనే మొట్టమొదటి ఎలుగుబంట్ల అభయారణ్యం. అక్కడున్న రాతి కొండల్లో ఎలుగుబంట్లతో పాటు మరిన్ని వన్యప్రాణులు సైతం ఆవాసం పొందుతుంటాయి. దీంతో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణా కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇది యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రసిద్ధి చెందిన హంపీ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో అక్కడికి వచ్చేవారిలో కొంత మంది ఈ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని సందర్శిస్తారు. మరికొంత మందికి అలాంటి ఒక ప్రత్యేకమైన వన్యప్రాణి అభయారణ్యం అక్కడ ఉందనే విషయం తెలియక కేవలం హంపీని మాత్రమే సందర్శించి తిరిగి వెళిపోతుంటారు.

**?అభయారణ్యం ఎలా ఉంటుందంటే..**

%ఈ అభయారణ్యం మొత్తం బండరాళ్లు, రాతి గుహలు, ఉద్గారాల్లో ఉంటుంది. దీంతో అక్కడ పెద్దగా వృక్షసంపద కనిపించదు. అయితే ఇక్కడ ఎలుగుబంట్లు, చిరుతపులులు, హైనాలు, నక్కలు, పాంగోలిన్లు వంటి వివిధ రకాల వన్యప్రాణులతో పాటు కొన్ని జాతుల పక్షులూ ఆవాసం పొందుతున్నాయి. మరోవైపు ఈ అభయారణ్యం ఏడాది పొడవునా తెరిచి ఉన్నా అక్టోబర్ నుండి మే వరకు మాత్రమే సందర్శించడానికి అనుకూలంగా ఉంటుంది.

ఆ సమయంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు ఆయా వన్యప్రాణులను సైతం తేలిగ్గా చూసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే సందర్శకులు ఆ అభయారణ్యానికి వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి.

**నియమ నిబంధనలు ఇవే..**

సందర్శకులు అభయారణ్యం లోపల ఎలాంటి తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులను తీసుకెళ్లరాదు.

అభయారణ్యం లోపల పెద్ద శబ్దాలు చేయడం, హారన్లు మోగించడం, పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ ఏర్పాటు చేయడం వంటివి నిషేధం.

సందర్శకులు జంతువులకు ఆహారం అందివ్వడం, వాటిని రెచ్చగొట్టడం లేదా రాళ్లు విసరడం వంటివి చేయరాదు.

అభయారణ్యం లోపల పర్యాటకులు ధూమపానం, మద్యం పానం చేయడం కూడా పూర్తిగా నిషేధం.


సందర్శకులు వారి నిర్దేశిత ప్రాంతాల్లోనే ఉండాలి. అభయారణ్యం లోపల ఎల్లవేళలా గైడ్‌ల సూచనలు తప్పక పాటించాలి.


అభయారణ్యం లోపల ఫోటోగ్రఫీ అనుమతిస్తున్నా.. ఫ్లాష్ ఉపయోగించడం మంచిది కాదు. ఫ్లాష్ లేకుండా, జంతువులకు ఇబ్బంది కలిగించకుండా ఎన్ని ఫోటోలైనా తీసుకోవచ్చు.


**అక్కడికి ఎలా చేరుకోవాలి?**

రోడ్డు మార్గంలో ఈ అభయారణ్యానికి చేరుకోవాలంటే మొదట హంపీకి వెళ్లాలి. అక్కడి నుండి 15 కి.మీ దూరంలో ఈ అభయారణ్యం ఉంటుంది. మరోవైపు హంపీ, హోస్పేట్, బళ్లారి, హుబ్లీ వంటి నగరాల నుండి ట్యాక్సీ లేదా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొచ్చు. ఒకవేళ మీరు రైలులో వెళ్లాలనుకుంటే హోస్పేట్ సమీప రైల్వే స్టేషన్. అక్కడి నుండి 20 కి.మీ దూరంలో ఈ అభయారణ్యం ఉంటుంది. విమానంలో వెళ్లాలనుకుంటే హోస్పేట్ సమీపంలో ఉండే జిందాల్ విజయనగర్ విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుండి ట్యాక్సీలో వెళ్లొచ్చు. ఒకవేళ హైదరాబాద్ నుండి మీరు సొంత వాహనంలో వెళ్లాలనుకుంటే మహబూబ్‌నగర్, రాయిచూర్, సింధనూర్ మీదుగా హంపీకి వెళ్లొచ్చు. అది సుమారు 400 కి.మీ దూరం ఉంటుంది.

# వర్షాకాలం రాకముందే ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాలను చుట్టేసిరండి..!







వర్షాకాలంలో ప్రయాణాలు చేయడం ఇష్టంలేని వారు అంతకుముందే ఈ అరుదైన ఆఫ్‌బీట్ డెస్టినేషన్లకు వెళ్లడానికి ట్రై చేయండి. ఇవి పశ్చిమ కనుమల్లో ఉండే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు.

అమెజాన్‌లో తక్కువ ధరకే స్మార్ట్ స్క్రీన్, గొప్ప పెర్ఫార్మన్స్ చూపే టాప్ క్వాలిటీ టాబ్లెట్స్‌ను సొంతం చేసుకోండి

కొంత మంది పర్యాటకులు కొద్దిపాటి వర్షపాతం కనిపించినా తమ ప్రయాణ ఏర్పాట్లను పూర్తిగా రద్దు చేసుకుంటారు. అది వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా నిజమనే చెప్పాలి. వర్షాకాల ప్రయాణం చాలా అద్భుతంగా ఉంటుందని తెలిసినా కొందరు బయటకు వెళ్లలేరు. అయితే, అలాంటి ప్రయాణికులు వర్షాకాలం ప్రారంభమవ్వడానికి ముందే పశ్చిమ కనుమల్లోని ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాలను సందర్శించి రండి. ఎందుకంటే వర్షాకాలంలో ఆ ప్రదేశాలు ఎక్కువకాలం అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉండటంతో అంతకన్నా ముందే ఓ ట్రిప్ ప్లాన్ చేయడం మంచిది. మరోవైపు ప్రస్తుత సమయంలో ప్రకృతి కూడా కొత్త అందాలతో నిండి ఉంటుంది కాబట్టి ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవచ్చు.

**అగుంబే, కర్ణాటక..**

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో ఉండే అగుంబే అనే పర్యాటక ప్రదేశాన్ని దక్షిణ భారతదేశంలోని చిరపుంజీ అని పిలుస్తారు. ప్రస్తుతానికి రుతుపవనాలు చాలా దూరంగా ఉండటంతో వర్షం గురించి ఆలోచించే ప్రయాణికులు భయపడాల్సిన అవసరం లేదు. ఎంచక్కా ఫ్యామిలీతో విహరించి అక్కడి అరణ్య ప్రాంతాన్ని, చుట్టుపక్కల గ్రామాలను సందర్శించవచ్చు. ఈ ప్రదేశం గొప్ప ప్రకృతి అందాలు, సాంస్కృతిక అనుభవాలను కలిగి ఉంది. దీంతో వేసవిలో అక్కడ విహరించడానికి అద్భుతంగా ఉంటుంది.

**వట్టకనల్, తమిళనాడు..**

తమిళనాడులోని అద్భుతమైన పర్యాటక ప్రదేశాల్లో కొడైకెనాల్ ఒకటి. దానికి సమీపంలోనే ఉంటుంది ఈ వట్టకనల్ అనే మరో అందమైన ప్రదేశం. అక్కడి పరిసరాలన్నీ చాలా ఆహ్లాదకరంగా, అద్భుతంగా, అందంగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంలా అనిపిస్తుంది. చుట్టూ కొండలు, లోయలు, పచ్చిక బయళ్లు పర్యాటకుల మనసును హత్తుకునేలా ఉంటాయి. అక్కడ అద్భుతమైన హోమ్‌స్టేల సౌకర్యం కూడా అందుబాటులో ఉండటంతో ఎలాంటి బెరుకు లేకుండా హాలిడేని ప్లాన్ చేయొచ్చు.

**పొన్ముడి, కేరళ..**

కేరళలోని తిరువనంతపురం సమీపంలో ఉండే అందమైన హిల్‌స్టేషన్ పోన్ముడి. అక్కడ పొగమంచుతో కనిపించే అందమైన కొండలు, ఆశ్చర్యం కలిగించే ప్రకృతి దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. అలాగే అన్యదేశ సీతాకోకచిలుకలతో సహా పెద్ద మొత్తంలో అరుదైన వృక్ష, జంతుజాలం కూడా అలరిస్తాయి. ఏడాది పొడవునా అక్కడి ఉష్ణోగ్రతలు కూడా సాధారణంగా ఉండటంతో వేసవి టూరిస్ట్ స్పాట్‌గానూ పనికొస్తుంది. అలాగే కల్లార్ నది అందాలు, మీన్‌ముట్టి జలపాతం సవ్వడులు గొప్ప ఆహ్లాదాన్ని పంచుతాయి.

**పొల్లాచ్చి, తమిళనాడు..**

తమిళనాడులోని కోయంబత్తూర్‌కు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండే పొల్లాచ్చి సైతం మంచి ఆఫ్‌బీట్ డెస్టినేషన్. ఇది అన్నామలై పర్వత కొండల్లో ఉండే సుందరమైన ప్రదేశం. ముఖ్యంగా అక్కడ తేయాకు తోటలతో పాటు చెరుకు, ఇతర పంటలకు ప్రసిద్ధి చెందింది. సహజంగానే ఇది వ్యవసాయ ఆధారిత ప్రదేశం కావడంతో చూడచక్కని ప్రదేశాలు ఆకట్టుకుంటాయి. కొడైకెనాల్‌ను సందర్శించే వారు తప్పక ఈ పొల్లాచ్చిని కూడా సందర్శిస్తారు. దీంతో మీరూ ఈ రెండు ప్రదేశాలను ఒకే టూర్‌లో కవర్ చేసే వీలుంటుంది.

**చోర్లా ఘాట్స్, గోవా..**

కర్ణాటక, మహారాష్ట్ర, గోవా మూడు రాష్ట్రాలు కలగలిసే అరుదైన ప్రదేశం ఈ చోర్లా ఘాట్స్. ఇది గోవా రాజధాని పనాజీకి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రకృతి ఒడిలో అద్భుతమైన దృశ్యాలను కలిగి ఉంటుంది. సాధారణంగా గోవాకు వెళ్లేవారంతా బీచ్‌లు, అక్కడి చారిత్రక కట్టడాలనే చూసొస్తారు. ఈ చోర్లాఘాట్స్‌ను పెద్దగా పట్టించుకోరు. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో ఉండే ఈ అందమైన ప్రదేశానికి కార్ లేదా బైక్‌పై వెళ్లాలి. విశాలమైన పొలాలు, అందమైన సరస్సులు, పురాతన వంతెనల గుండా సాగే ఆ ప్రయాణం గోవా ట్రిప్‌ను మరో లెవెల్‌కు తీసుకెళుతుంది.

# పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం..!

ఆరు నుండి ఎనిమిది వారాల వయసుగల నారును పొలములో నాతవలెను. ఆగష్టు, సెప్టెంబరు మాసము బీడీ పొగాకు, సెప్టెంబరు, అక్టోబరు మాసములు నాటు పొగాకు నాట్లు వేయుటకు అనువైనవి. బీడీ పొగాకు మొక్కలకు 75ఐ75 సెం.మీ దూరము, నాటు పొగాకుకు 70ఐ70 సెం.మీ దూరము ఇవ్వవలెను.అరోగ్యవంతమైన నారు మొక్కలు పొగాకు పంట అధిక దిగుబడికి, నాణ్యతకు ప్రథమ సోపానము. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ గత 6 దశాబ్దాలుగా ఆరోగ్యవంతమైన నారు మడులను పెంచడానికి, నాణ్యత గల పొగాకును పండించడానికి కృషి చేస్తూ, మేలైన యాజమాన్య పద్ధతులను కనుగొని, వ్యవసాయంలో ఖర్చుతగ్గించడానికి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించింది.

ప్రధాన పొలంలో మొక్కల స్థానాన్ని నిలువుగా, అడ్డంగా నడిపి గుర్తిస్తారు. పరస్పరం ఖండించుకునే బిందువుల వద్ద నారు మొక్కలు జాగ్రత్తగా నాటుతారు. నాటి సమయంలో తగినంత తేమ ఉండేట్లు చూస్తే వారు మొక్కలు స్థిరపడతాయి. వానలు లేకపోతే నాటి స్థలాలకు నారు మొక్కలు నాటే ముందు కుండతో నీరు పోస్తారు.

**ఎరువుల యాజమాన్యం:**

ఒక హెక్టారు బీడీ పొగాకుకు 110 కిలోల నత్రజని, 70 కిలోల పాస్పరసు 50 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులను, నాటు పొగాకుకు 40 కిలోల నత్రజని, 50 కిలోల పాస్పరము, 50 కిలోల భాస్వరాన్నిచ్చే రసాయనక ఎరువులు వాడాలి. నత్రజని ఎరువును రెండు సమభాగాలుగా చేసి నాటడానికి ముందు, నాటిన 25-30 రోజుల లోపల వేసుకోవాలి. భాస్వరము, పొటాష్ ఎరువులను ఒక మోతాదులో వేయాలి. పొటాష్ ఎరువును సల్ఫేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఇవ్వాలి. ఎరువులను మొక్కలను నాటుటకు ఒక వారము రోజులు ముందుగా మొక్కలు నాటు దాళ్ళలో, నాగటి చాళ్ళు తీసి వేయాలి.

సేద్యం మూడు పళ్ళ గొర్రుతో గాని, గుంటకతో గాని చేయవలెను. నేలలో వున్న తేమను బట్టి పైరు పెరుగుదలను బట్టి చేనులో వున్న కలుపును బట్టి ఎడసేద్యము చేసుకొనవలెను.మొగ్గ ప్రారంభమయ్యే దశలో బీడి పొగాకులో 14 నుండి 16 ఆకులు, నాటు పొగాకులో 16 నుండి 18 ఆకులు వుంచి కొమ్మ త్రుంచవలెన్. కొమ్మ తుంచిన నాలుగైదు రోజులలో పిలకలు వచ్చుట ఆరంభమగును. అందువలన ప్రతి ఐదు, ఆరు రోజులకు ఒకసారి చేతితోగాని లేక రసాయనిక మందులతో గాని పిలకలను తీసివేయవలెను. పెండిమిథాలిన్ 1.5% లేదా డెకెనాల్ 7% లేదా రాయల్డన్ 4% లేదా నీమ్ ఆయిల్ ఎమల్షన్ 35% వాడి పిలకలు రాకుండా నివారించుకోవచ్చును. నత్రజని అమ్మోనియం ఫాస్పేట్ రూపములోను భాస్వరమును, సింగిల్ సూపర్ ఫాస్పేట్, డై అమ్మోనియం ఫాస్పేటు రూపములోను మరియు పొటాషియంను సల్ఫేటు ఆఫ్ పొటాష్ రూపములో వేయాలి. నికోటియానా టబాకమ్ వంగడాలను దేశీ రకాలు అంటారు. వాటికి పొడవైన మొక్కలు, పొడవైన, వెడల్పైన ఆకులు. సాధారణంగా పింక్ పువ్వులు ఉంటాయి.టబాకమ్లో ప్రత్యేక వంగడాలు సిగరెట్, బీడి, హుక్కా నమలటం, నశ్యం పొగాకుకు దొరుకుతాయి. పొగాకు కింద వున్న మొత్తం విస్తీర్ణంలో 25% ఎఫ్.సి.వి.కింద 31% బీడి, 26% నమిలేది, హుక్కా 7.5% నాటు, 10.5% చుట్ట, చెర్రూట్లు లంక, బ పొగాకులు సాగు చేయబడుతున్నాయి.
పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం.!

**సాగుచేసే వంగడాలు:**

ఆంధ్రప్రదేశ్లో ప్రధానంగా సిగరెట్ పొగాకు, నాటు పొగాకు, బర్లీ పొగాకు, బీడి పొగాకు సాగు చేస్తారు.

**సిగరెట్ రకాలు:**ముఖ్యమైన సాగుచేసే వంగడాలు: ఎఫ్.సి.వి. పొగాకు, కేంద్రపొగాకు పరిశోధన సంస్థ (సి.టి.ఆర్.ఐ) స్పెషల్, కనకప్రభ, ధనబాయి, డెలెస్ట్, వర్జీనియాగోల్డ్, వైట్ గోల్డ్, 16/103 నాటు పొగాకు రకాలు: తోక ఆకు యన్ -1, కర్ర విత్తనం యన్-2, నీటివిత్తనం, కందుకూరు పెద్ద, సురకత్తి, జవలన్, ఏనుగుదేవి, సంఘుమెడ విత్తనం, గొర్రెగొమ్ము, డి.జి. -3, యన్.జి-3, డి.ఆర్ 1. బర్లీ పొగాకు రకాలు: అతి సామాన్యంగా పెంచే వంగడాలు: 1. బర్జీ-21, 2. కెపై-8 3. కెపై-16,4, హెచ్.డి.బి.ఆర్.జి.

తలలు నరకటం, పిలకలు తీసివేయటం: (ట్రాపింగ్, డిసక్కరింగ్)

తల నరకడం (టాపింగ్) చర్యలో పుష్పగుచ్ఛం బయటకు వచ్చే ముందుగాని, వచ్చిన తరువాత గానీ కొనమొగ్గను తీసివేయడం జరుగుతుంది. తలనరికిన తర్వాత గ్రీవపు మొగ్గలు క్రియాశీలమై పిలక అనే ప్రకాండాలను ఉత్పత్తి చేస్తాయి. పిలకలు తీసివేయటాన్ని “డీ సక్కరింగ్” అంటారు. తల నరకటం పిలకలు తీసివేయటం. లక్ష్యం, మొక్క పోషకాలను పుష్పాలకు విత్తనాలకు పోకుండా ఆకులకు మళ్ళించటమే. ఫలితంగా ఆకు పరిమాణం పెరుగుతుంది. పొగాకు దిగుబడి, నాణ్యత పెరుగుతాయి.

మొదటి పువ్వు తెరుచుకున్నప్పుడు మామూలు టాపింగ్ క్రింద తక్కువ టాపింగ్తో పోలిస్తే అదే సమయంలో చేస్తారు. కానీ అదే సమయంలో మరో



2 ఆకులు ఎక్కువ తీస్తారు. టాపింగ్ లేనిదానితో పోలిస్తే గరిష్ట క్యూరింగ్ చేసిన ఆకు దిగుబడి లభిస్తుంది. అయితే తేలిక నేలల్లో పెంచిన ఎఫ్.సి.వి.పొగాకును మాత్రమే టాపింగ్ చేస్తారు. కానీ ఇదే పొగాకు భారీ నేలల్లో లేదా ఎరువు వేసిన నేలల్లో టాపింగ్ చేయరు. పిలకలు పట్టుకోవడానికి వీలుగా ఉండే పరిమాణం చేరుతుండగా సాధారణంగా 2,3 సార్లు పిలకలను చేతితో తీసిస్తారు. పిలకలు తొలగించిన వెంటనే ఆకు, కాండం కలిసి చోట ఒక చుక్క కొబ్బరి నూనె వేసి పిలకలను అదుపులో ఉండవచ్చు. ఈ నూనె గ్రీవపు మొగ్గల అభివృద్ధిని నిరోధిస్తుంది. అయితే ఆకులపై పడినచో ఆకు నాణ్యత దెబ్బతింటుంది. అందువలన సి.టి./ఆర్. ఐ వాళ్ళు 'సక్కరవుట్ 3.5% మొక్కకు 10 మిల్లీలీటర్లు చొప్పున పైనుండి 5-6 ఆకుల మొదళ్ళలో వేయుట ద్వారా లేక వేప నూనె ఎమల్షన్ రసాయనం వాడుట ద్వారా పిలకలను నిరోధించవచ్చును.

పంట బాగా పెరిగితే టాపింగ్ ఆలస్యంగా చేయడం మంచిది. ఉత్తరం వైపు తేలిక నేలల్లో సాగుచేసి పొగాకులో బడ్ టాపింగ్ 24 ఆకులు ఉంచి, తరువాత దక్షిణ వైపు తేలిక నేలలు, సాంప్రదాయ నల్లనేలల్లో లేత ఆకుపచ్చ రకాలను మొదటి పుష్పం విచ్చుకునే దశలో, నీటి ఆధారిత / వర్షాధార నాటు పొగాకులో 14-16. ఆకులు ఉంచి, లంక పొగాకులో 12-14 ఆకులు ఉంచి మిగిలినవి తీసేస్తారు. బర్జీ పొగాకులో గోదావరి జిల్లా, గుంటూరు, తెలంగాణాలో వరుసగా 21-24 ఆకుల స్థాయి వద్ద, 14-16 ఆకుల స్థాయివద్ద, 24-26 ఆకుల వద్ద చేస్తారు.

# యంత్రాలతో చెరకు కోత ఎంతో మేలు..!



యంత్రాలతో చెరకు నరికించటానికి అనువుగా నాట్లు వేయడం చాలా ముఖ్యం. గతంలోలాగా చెరకు నరికే కూలీలు లభ్యం కావటం లేదు. రైతుకు ఏడాది పాటు చెరకు పెంచడం ఇబ్బందిగా ఉండటం లేదు కానీ, పండించిన చెరకును నరికించి, ఫ్యాక్టరీకి తరలించటం కష్టంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో టన్నుకు రూ. 600 లు చెల్లించినా కూలీలు లభించని సందర్భాలు నెలకొన్నాయి. చివరికి పండించిన చెరకును తగలబెట్టి నరికించి, ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. కూలీల కొరత చెరకు పెంచటానికి అదనపు ఖర్చుకు రైతు వెనకాడటం లేదు కాని, నరి కించి ఫ్యాక్టరీకి తరలించడానికి అనేక అవస్థలు పడాల్సివస్తుంది. దీంతో చెర కుసాగు పట్ల విముఖత కలుగుతోంది. కొందరు రైతులు చెరకు సాగుకు స్వస్తి పలుకుతున్నారు. అందుకు కారణం చెరకు నరికి, ఫ్యాక్టరీలకు తరలించే కూలీలు లభ్యం కాకపోవటమే. ఫలితంగా చెరుకుసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి, చెరకు ఉత్పత్తి తగ్గిపోతుంది. క్రషింగ్కు అవసరమైన చెరకు లభ్యంకాక నిర్ణీత వ్యవధి వరకు ఫ్యాక్టరీలు కూడా క్రషింగ్ చేయడంలేదు. కొన్ని ఫ్యాక్ట రీలు పూర్తిగా మూతపడుతున్నాయి.

చెరకు సాగువల్ల లాభపడేది రైతు ఒక్కడే కాదు. క్రషింగ్ జరిపిన ఫ్యాక్టరీ, ప్రభుత్వాలు కూడా లాభపడతాయి. అలాంటి చెరకు విస్తీర్ణం రోజు రోజుకు తగ్గటం వల్ల, ఫ్యాక్టరీలకు, ప్రభుత్వా లకూ నష్టమే. రైతు చెరకును వదిలేసి మరో పంట పండించుకోగలడు. ఫ్యాక్టరీ చెరుకు లేకుంటే మూత పడడం తప్ప మరో పంటను క్రషింగ్ చేసే అవకాశం ఉండదు. అలాగే చెరకు ద్వారా లభించే ఆదాయం మరే పంటతో ప్రభుత్వానికి సమకూరదు. ఇన్ని విధాలా నష్టపరుస్తున్న చెరకు నరికే కూలీలకు ప్రత్యామ్నాయం చెరకు నరికే యంత్రాలే. వాటిని ప్రోత్సహించటం చాలా అవసరం. యంత్రాలతో అనేక లాభాలు: యంత్రాలతో చెరకు నరికించడం వల్ల రైతుకు ఎన్నో లాభాలున్నాయి. మనుషులతో చెరుకు నరికించడం ఆలస్యంగా జరిగే ప్రక్రియ. 40 టన్నుల చెరకును మనుషులతో నరికించాలంటే 50 నుంచి 60 మంది అవసరమవు తారు. అంతమందిని ఒకేసారి సమకూర్చటం సాధ్యం కాదు. రైతులు 10 నుంచి 15 మంది కూలీలను సమకూర్చుకొని చెరకు నరికించి లారీలతో ఫ్యాక్ట రీకి తరలిస్తున్నారు. ఒకరిద్దరు నరికిన చెరుకును బండ్లతో ఫ్యాక్టరీకి తరలిం చినా, ఎక్కువమందితో నరికించి లారీలతో ఫ్యాక్టరీలకు తరలించినా, నరికిం చిన చెరకు కనీసం రెండు రోజుల తర్వాత గాని ఫ్యాక్టరీకి చేరదు. ఈ రెండు రోజులు చెరకు ఆరిపోవటం వల్ల బరువు తగ్గి, రసనాణ్యత క్షీణించి, పంచ దారి దిగుబడి శాతం తగ్గుతుంది. ఇలాంటి తరుగుదల రైతుకు, ఫ్యాక్టరీకి కూడా నష్టమే.యంత్రాలతో చెరుకు నరికించటం వల్ల ఈ తరుగుదలేవీ ఉండవు. నరి కించిన చెరకు రెండు లేదా మూడు గంటల వ్యవధిలో ఫ్యాక్టరీకి చేరుతుంది. ఎకరంలోని చెరకు నరకటానికి సుమారుగా మూడు గంటలు పడుతుంది. ఒక చిన్నపాటి యంత్రం ఒక రోజులో 10 నుంచి 15 ఎకరాల్లోని చెరుకును నరికించి, ఫ్యాక్టరీకి తరలించే వీలుంది. యంత్రాలకు అనుబంధంగా ట్రాలీలుం టాయి. అవి నరికిన చెరకు ముక్కలను అందుబాటులో ఉన్న లారీలకు చేర్చు తాయి. రైతుకు శ్రమ తగ్గుతుంది. పని త్వరగా పూర్తవుతుంది. చెరుకు దవ్వ, పండిన, ఎండిన చెరుకు కూడా ఫ్యాక్టరీకి తరలిపోయి కొద్దో గొప్పో అదనపు తూకం రావటానికి వీలుంది. యంత్రాలతో చెరకు నరికించటం వల్ల మరో లాభం కూడా రైతు కుంది. కూలీలతో చెరకు నరికించిన తర్వాత ప్రతి ఎకరంలోను 4 నుంచి 5 టన్నుల వరకు ఎండాకు పొలంలో మిగిలిపోతుంది. దాన్ని కాల్చి వేయటం మినహా రైతుకు మరో దారిలేదు. యంత్రాలతో నరికించిన పుడు ఎండాకు రెండంగుళాలు ముక్కలుగా నరకబడుతుంది.

# పెరటికోళ్ల పెంపకం..!



పెరట్లో సాధారణంగా నాటు కోళ్లను పెంచుకుంటారు. నాటుకోళ్లలో ఉత్పాదక శక్తి తక్కువ. పుంజులు 2.5-3.5కి, పెట్టలు 1.5 -1.8 కి. వరకు బరువు పెరుగుతాయి. సాలిన పెట్టలు 40-50 గుడ్లను మాత్రమే పెడతాయి. వీటిలో పొదిగే లక్షణం ఎక్కువ. కొక్కెర, మాశుచి వ్యాధులు సోకినప్పుడు 40-60 శాతం దాకా చనిపోతాయి. ఇంటి పరిసరాల్లోని, వంటింట్లోని ఆహార పదార్థాల్ని తిని పెరుగుతాయి గనుక వీటి మాంసం, గుడ్లలో ఎలాంటి పురుగు మందుల అవశేషాలు ఉండవు. అందుకే వీటికి డిమాండ్ పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని నాటుకోళ్లను సంకరపరిచి పెరట్లో లాభసాటిగా పెంచుకునే కోళ్ల రకాలను అభివృద్ధి చేశారు.

రాజశ్రీ:- పశువైద్య కళాశాల తిరుపతి, రాజేంద్రనగర్ లో లభిస్తాయి. 160 రోజుల నుంచి గుడ్లు పెట్టడం మొదలెట్టి సాలిన 180 గుడ్లు పెడతాయి. గుడ్లు బరువు 53 గ్రా.

వనరాజు,గ్రామప్రియ, కృషిబ్రో:- ఈ మూడు రకాలు కోళ్లు హైదరాబాద్ లోని కోళ్ల ప్రాజెక్టులో లభిస్తాయి. వనరాజు కోళ్లు 130-150 రోజుల నుంచి గుడ్లు పెట్టడం మొదలెట్టి సాలిన 140-150 గుడ్లు పెడతాయి. గుడ్లు 55-63 గ్రా బరువుంటుంది. గ్రామప్రియ కోళ్లు 150 రోజుల వయసు నుంచి మొదలెట్టి సాలిన 160-180 గుడ్లు పెడతాయి. కృషిబ్రో రకం పెరట్లో పెంచటానికి అనువైన బ్రాయిలర్ కోడి రకం.గిరిరాజు, స్వర్ణధార:- ఈ రెండు రకాల కోళ్లు కె. వి. ఎ., ఎఫ్. ఎస్. ఓ, బెంగళూర్ వారి వద్ద లభిస్తాయి. 150 రోజుల వయసు నుంచి గుడ్లు పెట్టడం ప్రారంభించ సాలీన గిరిరాజు రకం 160-170 స్వర్ణధార రకం 180-190 గుడ్లు పెడతాయి. ఇజత్ నగర్ లోని సెంట్రల్ ఏవియేషన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారు క్వారినిర్ బిక్, క్వారిశ్యాము, హిట్ క్వారి కోళ్ల రకాలను అభివృద్ధి చేశారు.అభివృద్ధి చేసిన పెరటికోళ్లు ఎక్కువ బరువు తుగతాయి. ఆకర్షణీయంగా ఉంటాయి. గుడ్లు ఉత్పత్తి, వ్యాధి నిరోధికశక్తి ఎక్కువ. సాలిన 160-180 గుడ్లు పెడతాయి. 3.5 నుంచి 4.5కిలోల బరువు తుగతాయి. ఐదు, ఐదున్నర మాసాల వయసు నుంచి గుడ్లు పెట్టడం ప్రారంభిస్తాయి. ఈ కోళ్లు గుడ్లను పొదగలేవు గనుక దేశీయ కోళ్లతో లేదా ఇంక్యూబేటర్ తో పొదిగించాలి. వ్యాధులు:- ఆరుబయట తిరిగే కోళ్లలో అంతర పరాన్నజీవుల నివారణకు ప్రతి 2 నెలలకోసారి డీవార్మింగ్ మందులు వాడాలి. ఒక రోజు వయసు కోడిపిల్లకు మెరెక్స్ టీకా, 7 వ రోజు ఆర్. డి. టీకాను వేయాలి. ప్రతికోడికి 3-4 గ్రా. చొప్పున సున్నపురాయి పొడి లేదా అల్చిప్పల పొడి అందిస్తే తగినంత కాల్షియం లభించడంతో తోలు గుడ్లు పెట్టావు. పేలు నివారణకు బుటాక్స్ మందునీళ్లు షెడ్లో పెట్టాలి.

# పసుపు రంగు మిర్చి





హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): పచ్చిమిర్చి ఆకుపచ్చ రంగులో, ఎండుమిర్చి ఎరుపు రంగులో ఉండటం చూశాం. కానీ, పసుపు రంగులో ఎండు మిరపను చూశారా? ఖమ్మం జిల్లా తిప్పారెడ్డిగూడేనికి చెందిన ఉపేందర్ పసుపు రంగు మిర్చిని సాగు చేస్తున్నాడు.ఎకరంలో సాగుచేయగా 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్టు ఆ రైతు తెలిపాడు. ఔషధ గుణా లు ఉన్న ఈ మిర్చి కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతుండటంతో క్వింటా రూ.70 వేలు పలుకుతున్నది.నిరుడు అక్టోబర్, నవంబర్లో పసుపురంగు మిర్చి ధర క్వింటాకు రూ.1.25 లక్షలు పలికినట్టు రైతు ఉపేందర్ తెలిపారు. తన పంటను ఇప్పు డు విక్రయించకుండా అధిక ధర కోసం కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచినట్టు చెప్పాడు. పసుపురంగు మిర్చి సాగుకు ఇతర ప్రాంతాల రైతులు ఆసక్తి చూపుతున్నారు.

## ఉసిరి పొడి.. సరికొత్త రాబడి..
## అధునాతన టెక్నాలజీని ఆవిష్కరించిన సీఎఫ్టీఆర్ఐ



సహజ ఆహార ఉత్పత్తులకు ఇటీవల కాలంలో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ కేంద్రంగా కృషి చేస్తున్న సెంట్రల్ ఫుడ్ టెక్నోలాజికల్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎఫ్టీఆర్ఐ).. తాజాగా ఉసిరికాయల పొడిని ఆధునిక విధానంలో తయారు చేసేందుకు సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించింది. స్వయం ఉపాధి సంఘాలతోపాటు యువ పారిశ్రామికవేత్తలకు సరికొత్త ఉపాధి అవకాశం లభిస్తుందని సీఎఫ్టీఆర్ఐ వర్గాలు పేర్కొన్నాయి.

ఆధునిక పద్ధతిలో ఉసిరిపొడి తయారీ

ఉసిరికాయలను కొనేముందు క్వాలిటీని చెక్ చేసుకొంటారు.

70-80 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న వేడి నీటిలో శుభ్రం చేస్తారు.

8-10 గంటలపాటు 40-50 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే ప్రత్యేక క్యాబినెట్ డ్రైయ్యర్స్‌ను వినియోగించి ఎండబెడతారు.

ఇలా ఎండిన కాయలను పొడిగా మారుస్తారు.

అంతర్జాతీయ ఫుడ్ ప్రాసెసింగ్ నిబంధనల ప్రకారం తయారు చేసే ఈ పొడిని ఎగుమతి చేసుకోవచ్చు.

# ముద్దుగుమ్మకు ఒక్క రోజు రెండు పరీక్షలు




ఈ మాయ పేరేమిటో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ కావ్య థాపర్. మోడలింగ్ లో రాణించడం ద్వారా సినిమా ఇండస్ట్రీ వర్గాల దృష్టిని ఆకర్షించిన ఈ ఉత్తరాది ముద్దుగుమ్మ సౌత్ లో స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకోవాలని విపరీతంగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే సౌత్ లో ఈ అమ్మడు చేసిన సినిమాలు పెద్దగా ఆధరణ దక్కించుకోలేక పోతున్నాయి. ఇలాంటి సమయంలో ఈ అమ్మడికి మాస్ మహారాజా రవితేజకు జోడీగా ఈగల్ లో నటించే అవకాశం దక్కింది. సంక్రాం తికి విడుదల అవ్వాల్సిన ఈగల్ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేసేందుకు గాను రీ షెడ్యూల్ చేసిన విషయం తెల్సిందే. ఫిబ్రవరి 9న ఈగల్ సినిమాతో పాటు సందీప్ కిషన్ నటించిన ఊరి పేరు భైరవకోన సినిమా విడుదల అవ్వబోతుంది. ఈగల్ తో పాటు ఆ సినిమా లో కూడా కావ్య థాపర్ హీరోయిన్ అవ్వడం ఇక్కడ ప్రత్యేకమైన విషయం. ఈ రెండు సినిమాలు కూడా ఒకే రోజు రాబోతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాల యొక్క ప్రమోషన్ హడావుడి కూడా మొదలు అయ్యింది. ఈగల్ సినిమా నిర్మాతలు సోలో రిలీజ్ ను కోరుకుంటున్నారు. కానీ అది ఎంతవరకు సాధ్యం అనేది క్లారిటీ లేదు. కనుక ఈగల్ తో పాటు అదే రోజున భైరవకోన సినిమా కూడా విడుదల అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకే రోజు ఈ ముద్దుగుమ్మ నటించిన సినిమాలు విడుదల అవ్వబోతున్న నేపథ్యంలో ఉత్కంఠ వాతావరణం కనిపిస్తోంది. ఈ రెండు సినిమాలు కూడా కావ్య థాపర్ కి అత్యంత కీలకం అనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఈ సినిమాలు హిట్ అయితేనే ఆమె కొత్త సినిమా ఆఫర్లను దక్కించుకోగలదు. కనుక ఒకే రోజు రెండు పరీక్షలు ఎదుర్కోబోతున్న కావ్య థాపర్ కి ఎలాంటి ఫలితం దక్కుతుందో చూడాలి.

# అక్కడుంటే అదే ఆలోచన : శ్రీలీల



రాఘవేంద్రరావు కొత్త పెళ్లి సందడితో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగు మూలాలు ఉన్న శ్రీలీల హీరోయిన్ గా తెలుగు లో వరుసగా నటిస్తోంది. మొదటి సినిమా నిరాశ పరిచిన కూడా ధమాకా సినిమాతో ఈ అమ్మడు మొదటి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ధమాకా సినిమా తో వచ్చిన సక్సెస్ ను సద్వినియోగం చేసుకున్న ముద్దుగుమ్మ శ్రీలీల వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ఆ మధ్య ఈ అమ్మడు ఏకంగా అర డజను సినిమాలను వరుసగా చేసింది. తాజాగా సంక్రాంతికి గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వరుస సినిమాలతో జోరు మీదున్న శ్రీలీల తాజాగా చిట్ చాట్ లో ఫ్యాన్స్ తో పలు విషయాలను పంచుకుంది. సినిమా సెట్స్ లో ఉన్న సమయంలో తాను సినిమా గురించి, అందులో తన పాత్ర గురించి తప్ప మరే విషయాలను ఆలోచించను. అందుకే తాను పాత్ర విషయంలో మరియు డాన్స్ విషయంలో ఎక్కువ శ్రద్ధ పెట్టగలను అంటూ చెప్పుకొచ్చింది. షూటింగ్ సమయంలో ఇతర విషయాల గురించి ఆలోచిస్తే కచ్చితంగా ఆ ప్రభావం నటన పై పడుతుంది. అందుకే తాను సెట్స్ లో ఓపెన్ మైండ్ తో ఉంటాను. చేయబోతున్న షాట్ గురించే ఆలోచిస్తాను అన్నట్లుగా చెప్పుకొచ్చింది. ఎక్కువ సమయం తీసుకోకుండా తక్కువ సమయంలోనే షాట్ ని పూర్తి చేసేందుకు హోం వర్క్ చేస్తానని కూడా పేర్కొంది. చదువు విషయంలో కూడా తాను అలాగే ఉంటాను అంది. చదివేందుకు పుస్తకం ముందు పెట్టుకుంటే చదువు విషయం తప్ప మరేమి కూడా తాను ఆలోచించను అంటూ చెప్పుకొచ్చింది. తాను పుస్తకం పట్టి చదవడం మొదటి పెట్టాను అంటే ఇతర విషయాలు ఏవీ కూడా నాకు గుర్తుకు రావు అంది. ఒక పని చేసే సమయంలో మరో విషయం ఆలోచించకపోవడం మంచి అలవాటే అన్నట్టు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంకో కమెడియన్ హీరోగా..




మన టాలీవుడ్ ఇండస్ట్రీలో కమెడియన్లు హీరోగా మారడం సర్వసాధారణమే. అయితే కొంతమంది కమేడియన్స్ హీరోగా మారి సక్సెస్ అందుకుంటే.. మరకొంతమంది అనవసరంగా ప్రయోగాలు చేసి ఉన్న కెరియర్ పాడు చేసుకున్నారు. ఇక ఈ తరంలో యంగ్ కమెడియన్స్ తమ కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్విస్తూ మంచి పాపులారిటీని సొంతం చేసుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో కొద్దిమంది హీరోలుగా మారుతున్నారు. అలా ఈ జనరేషన్ లో ఇప్పటికే కమెడియన్ సత్య హీరోగా మారి మంచి సక్సెస్ అందుకున్నాడు. ఇక ఇటీవల వెన్నెల కిషోర్ కూడా హీరోగా మారి ఓ క్రైం ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ తో ఒక ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇక ఈ లిస్టులో మరో కమెడియన్ అభినవ్ గోమఠం కూడా చేరిపోయాడు. తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహించిన 'ఈ నగరానికి ఏమైంది' అనే సినిమాతో కమెడియన్ గా ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చాడు అభినవ్. తారక్ తో ఇబ్బంది లేకుండా.. ఈ సినిమాలో తన కామెడీ, డైలాగ్ డెలివరీతో యూత్ ని విపరీతంగా ఆకట్టుకున్నాడు. ఈ సినిమా తర్వాత అభినవ్ కి భారీ పాపులారిటీ వచ్చింది. దాంతో స్టార్ హీరోల సినిమాల్లోనూ కమెడియన్గా మెప్పించాడు. ఈ నగరానికి ఏమైంది తర్వాత మీకు మాత్రమే చెప్తా, సేవ్ ది టైగర్స్ వంటి సినిమాల్లో తన కామెడీతో ఆకట్టుకున్నాడు. ఓవైపు కమెడియన్గా నటిస్తూనే ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ నగరానికి ఏమైంది సినిమాలోని తన డైలాగ్ నే తన ఫస్ట్ మూవీకి టైటిల్ గా పెట్టుకున్నాడు.' మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' అనే టైటిల్ తో అభినవ్ గోమటం కొత్త సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ లోగోను దర్శకుడు తరుణ్ భాస్కర్ విడుదల చేశారు. ఓ కాలేజీలో జరిగిన ఈవెంట్లో అక్కడి స్టూడెంట్స్ తో కలిసి తరుణ్ భాస్కర్ టైటిల్ లోగోని రిలీజ్ చేశారు. తిరుపతిరావు ఇండ్ల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కాసుల క్రియేటివ్ వర్క్స్ పతాకంపై భవానీ కాసుల, ఆర్ఎం రెడ్డి, ప్రశాంత్. వి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టైటిల్ లోగో రిలీజ్ సందర్భంగా దర్శకుడు మాట్లాడు తూ.." కమెడియన్ గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా తన నటనతో ప్రశంసలు అందుకున్న అభినవ్ గోమటంలోని మరో కొత్త కోణాన్ని ఈ సినిమాలో చూస్తారు. అయోధ్యలోని శ్రీ సీతారాముల ప్రాణ పతిష్ట రోజే మా సినిమా లోగోను ఆవిష్కరించడం ఎంతో లక్కీగా భావిస్తున్నా ం. అన్నిభావోద్వేగాల మేళవింపుతో లవ్, కామెడీ ఎంటర్టైనర్గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. కొత్తదనంతో కూడిన ఈ చిత్రం తప్పకుండా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం వుంది. ఫిబ్రవరి ద్వితియార్థంలో చిత్రాన్ని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం" అని తెలిపారు.

# లేడీకిల్లర్ ట్రైలర్: అతడు ఆమె విధ్వంసకర ప్రేమ



అర్జున్ కపూర్–భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'ది లేడీకిల్లర్' ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ ఆద్యంతం అనైతిక సంబంధం విధ్వంశం గగుర్పాటుకు గురి చేస్తోంది. ఈ చిత్రం కథాంశం థ్రిల్ కలిగిస్తోంది. అత్యంత ప్రమాదకరమైన మహిళ (భూమి పెడ్నేకర్) వల్లో పడే ఒక స్మాల్ టౌన్ ప్లేబాయ్ గా ఇందులో అర్జున్ కపూర్ నటించాడు. ఈ జంట కలయిక ప్రమాదాలకు దారి తీస్తుంది. అర్జున్ ఒక మాజీ మహారాజును కలవడానికి రాజుగారి బంగ్లా గుమ్మం వద్దకు రావడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. అయితే భూమి పెడ్నేకర్ అతడిని తలుపు వద్ద పలకరిస్తుంది. వారి నడుమ ఉద్వేగభరితమైన ప్రేమ వేళ్ళూనుకుంటుంది. కథ విప్పే క్రమంలో భూమి ఒరిజినాలిటీ ఏమిటనేది అర్జున్ గుర్తిస్తాడు. హాఫ్ సెంచరీ వయసులో ఏంటిది మ్యామ్? ఇది వారి సంబంధంలో ప్రమాదకరమైన – విధ్వంసకరమైన మలుపునకు దారి తీస్తుంది. ట్రైలర్ లో హత్య చేసి రక్తపుమరకలు కనిపించకుండా మేనేజ్ చేసే ప్రమాదకర అమ్మాయిగా భూమి కనిపిస్తోంది. 'ది లేడీకిల్లర్'ని అత్యంత ఎమోషనల్ రైడ్ గా ఉంటుందని అర్జున్ కపూర్ చెబుతున్నాడు. "నేను ఈ చిత్రం కోసం చాలా కష్టపడి పని చేసాను. మెంటల్గా ఎమోషనల్గా భూమికి – నాకు సినిమా చాలా ఘాటైన అనుభవం. ప్రేమకథ కోణంలో ఇది చాలా వాస్తవమైనది. అందుకే నేను షూటింగ్ పూర్తయాక సుదీర్ఘ సెలవుపై దూరంగా వెళ్లాను. ఆ సినిమా కోసం దాదాపు 45 రోజులు షూట్ చేసి, విరామం కోసం వెళ్లిపోయాను. నేను ఆ ప్లేస్ నుంచి బయటకు రావాలి కాబట్టే అలా చేసాను" అన్నారు. మెగా వెడ్డింగ్కి రేణుదేశాయ్ స్కిప్ కారణం? %దీూ% పాస్, సెక్షన్ 375, బ్లర్ వంటి చిత్రాలతో పాపులరైన దర్శకుడు అజయ్ బహ్లా ది లేడీకిల్లర్ని తెరకెక్కించారు. తాజా ఇంటర్వ్యూలో దర్శకుడు ఈ మూవీ గురించి రివీల్ చేసారు. భూమి– అర్జున్లతో కలిసి పనిచేసిన అనుభవాన్ని అజయ్ షేర్ చేసుకున్నారు. లేడీకిల్లర్ నవంబర్ 3న థియేటర్లలో విడుదల కానుంది.

# పడిపోయిన కంగనా కెరటం...!



సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగిసి పడుతూ ఉంటాయి. కింద పడ్డ కెరటం మళ్లీ లేస్తూ ఉంటుంది. ఎంత ఎత్తుకు ఎగసిన కూడా కెరటం కిందకు పడాల్సిందే. కెరటం మాదిరిగా కింద పడ్డా కూడా మళ్లీ పైకి లేచేందుకు ప్రయత్నించాలి అంటూ చాలా మంది అంటూ ఉంటారు. ఇప్పుడు బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ హీరోయిన్ కంగనా పరిస్థితి పడిపోయిన కెరటం మాదిరిగా ఉందనే టాక్ వినిపిస్తోంది. కొన్ని ఏళ్ల క్రితం కంగనా వెండి తెరపై కనిపిస్తే చాలు పదుల కోట్ల వసూళ్లు నమోదు అయ్యేవి. కొన్ని సినిమాలు ఏకంగా వందల కోట్ల వసూళ్లు కూడా తెచ్చి పెట్టాయి. అంతటి క్రేజ్ ను దక్కించుకున్న కంగనా తన మాటలతో ఫైర్ బ్రాండ్ ఇమేజ్ ని కూడా సొంతం చేసుకుంది. ఆమె ఏం కామెంట్స్ చేసినా మౌనంగా ఉండటం మంచిది అని చాలా మంది అనుకుంటారు. హాఫ్ సెంచరీ వయసులో ఏంటిది మ్యామ్? ఆమె ను విమర్శించినా, ఆమె గురించి ఏమైనా వ్యాఖ్యలు చేసినా కూడా అంతకు పదిరెట్లు ఆమె నుంచి కామెంట్స్ ను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎవరు కూడా ఆమె నోట్లో నోరు పెట్టేందుకు ఆసక్తి చూపించేవారు కాదు. సినిమా ల పరంగా కూడా ఆమె దూసుకు పోతున్న సమయంలో బ్యాక్ టు బ్యాక్ అట్టర్ ఫ్లాప్స్ ఆమె కెరీర్ ను తీవ్రంగా దెబ్బ తీశాయి. మణికర్ణిక సినిమా తర్వాత ఇప్పటి వరకు ఆమె నుంచి పర్వాలేదు అన్నట్లుగా అనిపించిన సినిమా రాలేదు. బాలీవుడ్ లో వర్కౌట్ అవ్వడం లేదని తమిళ్ లో చంద్రముఖి 2 సినిమాలో నటించింది. ఆ సినిమా లో కంగనా ఎందుకు నటించిందో అర్థం కావడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అంతగా విమర్శలు ఎదుర్కొంటున్న కంగనా రాబోయే సినిమాలపై కూడా పెద్దగా బజ్ లేదు. మెగా వెడ్డింగ్కి రేణుదేశాయ్ స్కిప్ కారణం? ఒకప్పుడు కంగనా రనౌత్ సినిమాలు వస్తున్నాయి అంటే ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన ప్రేక్షకులు ఇప్పుడు ఆమె సినిమాలు వస్తున్నాయంటే లైట్ తీసుకునే స్థాయికి ఆమె క్రేజ్ పడిపోయింది. ఉవ్వెత్తున ఎగసి పడ్డ కెరటం మాదిరిగా కంగనా కెరీర్ ఎగిసింది. అయితే తక్కువ సమయంలోనే కిందికి పడింది. తిరిగి కంగనా కోలుకుంటుందా, ఆమె నుంచి మళ్లీ వందల కోట్ల సినిమాలు వస్తాయా అంటే డౌటే అంటూ చాలా మంది సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే చాలా మంది ప్రముఖ ఫిల్మ్ మేకర్స్ తో కంగనా సున్నం పెట్టుకుంది. కనుక వారు ఈమె తో వర్క్ చేయడం కు ఆసక్తిగా లేరు. కనుక సొంతంగా సినిమాలు చేసుకోవాల్సిందే... లేదంటే కొత్త వారితో సినిమాలు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే సక్సెస్ లు ఎంత వరకు వస్తాయి అనేది క్లారిటీ లేదు. అందుకే కంగనా తిరిగి పుంజుకోవడం ఎంతవరకు సాధ్యమో చెప్పలేమని చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.